RNI No.68319/98

# మెట్రో ఈవినింగ్స్
Estd. 1998

VOICE OF WORDS (English Daily)

హైదరాబాద్,మంగళవారం
ఆగస్టు 25 2026
పేజీలు : 8+4
సంపుటి: 29,సంచిక:66
వెల: రూ.6/-

Published from Hyderabad | ఎడిటర్ : దేవరకొండ కాళిదాస్ | Metro Evenings Telugu Daily

## హస్తినలో దంచికొట్టిన వాన

ఇంటర్నెట్ డెస్క్: దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం భారీ వర్షం కురిసింది. బలమైన ఈదురుగాలులలతో కూడిన వానకు ఢిల్లీతో పాటు నోయిడా, గాజియాబాద్, గురుగ్రామ్, ఫరీదాబాద్ ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. పలుచోట్ల రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. గురుగ్రామ్, ఫరీదాబాద్ జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. సోహ్నా రోడ్లో లోని ఇస్లాంపూర్ వద్ద నీరు నిలవడంతో 4 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతోపాటు పలుచోట్ల వృలు నేలకొరిగాయి.



# తెలంగాణపై గుజరాతీల వివక్ష

### 4 కోట్ల ప్రజలను కేంద్రం అవమానించింది
### సచివాలయంలో మంత్రులు,ఎంపీలు, ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ ప్రెస్ మీట్

హైదరాబాద్ (మెట్రోన్యూస్): అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడం...తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడానికి గుజరాతీ నాయకత్వం చేస్తున్న కుట్రగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఫెడరేషన్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తూ... కేంద్రం చూపించిన వివక్షను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముక్తకంఠంతో ఖండిస్తున్నట్టు ప్రకటించారు. ఇది వ్యక్తిగతంగా తనకు జరిగిన అవమానం కాదని... యావత్ 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయం అన్నారు. దీనిని రాజకీయాలకు అతీతంగా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.అమెరికాలో ఒకే తరహా కార్యక్రమానికి గుజరాత్ సీఎంను అనుమతించి.. తనకు అనుమతి నిరాకరించడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సచివాలయంలో మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి ప్రెస్ మీట్ నిర్వహించారు. తెలంగాణ అంటే మోదీకి వివక్ష.. చిన్న చూపు.. అని కామెంట్ చేశారు. రాజకీయపరమైన నిర్ణయాలతో పర్యటనను తిరస్కరించామన్నారు. ఆ రాజకీయ కారణాలు ఏమిటో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పాలని డిమాండ్ చేశారు.విద్య,క్రీడల్లో పెట్టుబడులను ఆహ్వానించేందుకు అమెరికా వెళ్లాలని భావించాం. మన పిల్లలు విదేశాలకు వెళ్లి చదువుకోవాలంటే బోలెడు ఖర్చు అవుతుంది.. అదే విదేశీ వర్సిటీలు ఇక్కడికే వచ్చి కోర్సులు ప్రారంభిస్తే.. మనకు లాభం చేకూరుతుంది. మోదీ దేశానికి ప్రధానిగా కాకుండా... ఒక్క గుజరాత్ రాష్ట్రానికే ప్రధాని అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. తనది అధికారిక పర్యటన.. తమ కార్యక్రమాలు అన్నీ భారత రాయబార కార్యాలయం పర్యవేక్షణలో జరుగుతాయి. ఇది చాటు మాటుగా జరిగే వ్యవహారం కాదు.. అన్ని వివరాలను విదేశీ వ్యవహారాల శాఖకు అందించాం అని సీఎం స్పష్టం చేశారు.

### 22ఏ నిషేధిత భూములపై
# ఆందోళనొద్దు



### అక్రమార్కులపై క్రిమినల్ కేసులు
### మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ (మెట్రో న్యూస్): రాష్ట్రంలో 22ఏలో లక్షలాది ఎకరాలు చేర్చారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, 2023 డిసెంబర్ 7 నాటికి ఉన్న పరిస్థితి, ప్రస్తుత పరిస్థితి, ఏ కేటగిరీ భూములు ఎంత మేర నిషేధిత జాబితాలో ఉన్నాయో పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచుతున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 22ఏ పేరిట ప్రతిపలు అనవసర రాద్ధాంతాన్ని సృష్టిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. 22ఏ పేరిట ఇంతవరకు వచ్చిన దరఖాస్తుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని దీనిపై దుష్ప్రచారాలను నమ్మవద్దని కోరారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటికి నిషేధిత జాబితాలో ఉన్న ఫారెస్ట్, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్, ప్రభుత్వ భూములు,కోర్టు ఆదేశాల మేరకు నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ప్రైవేట్ భూములు తదితర వివరాలను కేటగిరీల వారీగా మొత్తం వివరాలను మీడియాకు విడుదల చేశారు. సోమవారం నాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. లక్షలాది ఎకరాలు 22ఏలో పెట్టారని ప్రతిపలు ఆరోపణలు చేయడం కాదు.. ఎంత ఉంది, ఎందుకు ఉంది, ఎవరి భూమి, ఏ కారణంతో నిషేధిత జాబితాలో పెట్టారనే ప్రతి అంశాన్ని రికార్డుల తో చెబుతాం. వాస్తవాలు ప్రజల ముందుకు వస్తే ఎవరు నిజం చెబుతున్నారో ప్రజలే నిర్ణయిస్తారు అన్నారు.

### సారంపల్లి మల్లారెడ్డి మృతిపై
# సీఎం సంతాపం



హైదరాబాద్ (మెట్రో న్యూస్): రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడిన రైతు నాయకుడు, కమ్యూనిస్టు నేత సారంపల్లి మల్లారెడ్డి గారు మరణించారని తెలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రైతుల హక్కులు, వ్యవసాయ సమస్యల పరిష్కారం కోసం ముందుండి అనేక ఉద్యమాలు నడిపించారని గుర్తుచేశారు. రైతు సంఘం నేతగా, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. భూమి హక్కులు, సాగునీరు, వ్యవసాయ రుణాలు, విత్తనాలు వంటి వ్యవసాయ రంగానికి సంబంధించిన విస్తృత అంశాలపై నిరంతరం కృషి చేస్తూ జీవితాన్ని రైతుల సంక్షేమం కోసం అంకితం చేసిన నాయకుడు మల్లారెడ్డి అని పేర్కొన్నారు. సారంపల్లి మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మల్లారెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులకు ముఖ్యమంత్రి సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# 7నుంచి అసెంబ్లీ సమావేశాలు




హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. సెప్టెంబరు 7వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. సోమవారం విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి అందుబాటులో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యే లతో సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. ఎన్ని రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలి? ఏయే అంశాలను చర్చకు తీసుకోవాలి? అన్నదానిపై తొలిరోజు బీఏసీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారు.

### శ్రీశైలం,సాగర్ జలాలు
# తాగు నీటికే!



హైదరాబాద్ (మెట్రో న్యూస్): ఎలినినో దృష్ట్యా శ్రీశైలం, సాగర్ జలాలను తాగు నీటికే వాడు కోవాలని కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ భేటీలో తెలుగు రాష్ట్రాలు నిర్ణయించాయి. తాము అక్టోబర్ వరకు 47టీఎంసీలు అడిగామని ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తి చెప్పారు. 50:50 వాటా ఇవ్వాలని కోరినట్లు టీజీ ఈఎన్సీ రమేశ్ బాబు తెలిపారు. పోతిరెడ్డిపాడు నుంచి ఏపీ ఎక్కువ నీరు వాడు కుంటోందని ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. వాటాలపై నిర్ణయం తీసుకోకుండానే కమిటీ భేట సెప్టెంబర్ 4కు వాయిదా పడింది.

# క్రమ శిక్షణ కమిటీ దే నిర్ణయం



### ఈ అంశంపై ఎవరూ మాట్లాడొద్దు కొండా సురేఖపై సీఎం

హైదరాబాద్ (మెట్రో న్యూస్): మంత్రి కొండా సురేఖ అంశం పై కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ దే తుది నిర్ణయమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విలేకరులు కొండా సురేఖ అంశాన్ని ప్రస్థావించగా అది పార్టీ చూసుకుంటుందని తెలిపారు.పైగా పార్టీ క్రమశిక్షణ కు సంబంధించిందని చెప్పారు.ఆ అంశం క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉన్నందున పార్టీ అంతర్గత అంశాలపై బహిరంగంగా మాట్లాడనని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అధిష్టానం నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాలన్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో, పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎవరూ అతీతులు కారని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.




# దివ్యాంగ వధువులకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది.ఈ పథకాల కింద సాధారణ లబ్ధిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది.

# అటవీశాఖలో డిప్యూటేషన్లు రద్దు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చింది. ఆమెకు కేటాయించిన అటవీశాఖలో అధికారుల డిప్యూటేషన్లు రద్దు చేసింది. మంత్రికి సమాచారం ఇవ్వకుండానే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గతంలో ఆమోదించిన 25 మంది అధికారులు, సిబ్బంది డిప్యుటేషన్లను రద్దు చేసినట్లు సమాచారం. కాగా కూతురు కామెంట్స్ వివాదం నేపథ్యంలో సురేఖ మంత్రిత్వ శాఖపై ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

మెట్రో

హైదరాబాద్ , మంగళవారం ఆగస్టు 26, 2026



# కేంద్రం ముందు రేవంత్ సర్కార్ మోకరిల్లిందిలి

## - తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ ,మెట్రో న్యూస్ :** కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ముందు రేవంత్ రెడ్డి సర్కారు మోకరిల్లిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. గృహ విద్యుత్ కనెక్షన్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ఉచిత కరెంట్ ను ఎత్తివేసే కుట్రకు పాల్పడుతోందని ఆరోపించారు. సోమవారం ఈమేరకు వీడియో సందేశం రిలీజ్ చేశారు. అనంతరం పీపుల్స్ ప్లాజాలో టీజీఎస్పీడీసీఎల్ ఏర్పాటు చేసిన పవర్ ఎక్స్ పో – 2026ను సందర్శించి అక్కడ ప్రదర్శనకు ఉంచిన స్మార్ట్ మీటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కరెంట్ ను దూరం చేయడంతో పాటు లాండ్రీ షాపులు, సెలూన్లకు ఉచిత కరెంట్ ఎత్తివేసే కుట్రలో భాగంగానే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పథకంలో భాగంగానే రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. గతంలో వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ప్రయత్నం రేవంత్ సర్కారు చేసిందన్నారు. అదానీకి లాభం చేయడానికి కేంద్రం స్మార్ట్ మీటర్లు ప్రవేశ పెడుతుంటే రేవంత్ సర్కారు దానికి వంత పాడుతోందన్నారు. దీనిపై ప్రజల మైండ్ వాష్ చేసేందుకే పీపుల్స్ ప్లాజాలో ప్రదర్శన ఏర్పాటు చేసిందన్నారు. ఈఆర్సీ వద్ద రైతులు గొడవ చేస్తే వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటు చేయబోమని చెప్పారని.. గృహ విద్యుత్ కనెక్షన్లకు మాత్రం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామని ఇటీవల ట్రాన్స్ కో సీఎండీ చెప్పారని గుర్తు చేశారు. సెల్ ఫోన్ ముందస్తుగా రీచార్జ్ చేసుకున్నట్టుగా ఇకపై కరెంట్ కు ముందస్తు చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి స్మార్ట్ మీటర్లతో వస్తుందన్నారు. రీచార్జ్ ఎప్పుడు అయిపోతే అప్పుడు ఆటోమేటిక్ గా ఇండ్లలో కరెంట్ కట్ అవుతుందని చెప్పారు. యూపీలో స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్లు ఏర్పాటు చేస్తే ప్రజలు ఆగ్రహంతో వాటిని తొలగించి కరెంట్ ఆఫీసుల్లో పడేసి వెళ్తున్నారని అన్నారు. ఇప్పుడున్న మీటర్లతోనే కరెంట్ సరఫరా చేయాలని స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ లు, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేసి కరెంట్ సరఫరా బాగుండేలా చర్యలు చేపట్టాలని కోరారు. మన కరెంట్ ను అదానీ చేతుల్లో పెట్టే ప్రయత్నాలను ఇకనైనా విరమించుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తెలంగాణ రక్షణ సేన వ్యతిరేకిస్తుందని.. ప్రజల కోసం ప్రజాక్షేత్రంలోకి వచ్చి ఉద్యమిస్తుందని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడి రూ.వేల కోట్లు కొల్లగొట్టిన అధికారుల గుట్టును ఏసీబీని ఉపయోగించి బయట పెడుతున్న ప్రభుత్వం ఆ అవినీతికి మూల కారకుల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఈమేరకు ఎక్స్ లో సోమవారం పోస్ట్ పెట్టారు.

గత ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో అధికారులు వందలు, వేల కోట్ల ప్రజాధనం దోచుకోవడానికి వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తున్న వారి సంగతి ఏమిటని ప్రశ్నించారు. అధికారులను ముందు పెట్టి రూ.వేల కోట్లు దోచుకుంటున్న వారి నుంచి ఆ అవినీతిని సొమ్ము కక్కించే వాళ్లు ఎవరు అని నిలదీశారు. అవినీతికి అధికారులను బాధ్యులను చేస్తున్నారని.. వారిని అడ్డుపెట్టుకొని వ్యవస్థలను దోపిడీ చేసే వారిని కట్టడి చేయాల్సిన వాళ్లెవరని ప్రశ్నించారు. తమకు మంచి చేస్తారని నమ్మి ప్రజలు అధికారం ఇస్తే భవిష్యత్ తరాలకు చెందాల్సిన సంపదను కొల్లగొడుతున్న వారిని చూస్తూ ఊరుకోవాలా అని నిలదీశారు. తన ప్రశ్నలపై పౌర సమాజం సీరియస్ గా చర్చించాలని విజ్ఞప్తి చేశారు.

## సీఎంకు మంత్రుల, ఎమ్మెల్యేల శుభాకాంక్షలు





**హైదరాబాద్ ,మెట్రో న్యూస్ :** విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు. శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన మీడియా సమావేశం అనంతరం వీరంతా సీఎం ను కలిసారు.

## 750 గ్రాముల గంజాయి పట్టివేత



**హైదరాబాద్ ,మెట్రో న్యూస్ :** కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి అమ్మకాలు జరుపుతున్న పి. యశ్వంత్ వి విజయ్ అనే ఇద్దరు వద్ద డిటిఎఫ్ కుత్బుల్లాపూర్ టీం గంజాయిని పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గంజాయిని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఈ ఎస్ హనుమంతరావు తెలిపారు.

# ఉద్యోగుల మహా ధర్నాకు అనుమతి ఇవ్వండి



## - జిల్లా అదనపు కలెక్టర్, జెయింట్ సీపీకు వినతి పత్రం సమర్పణ



**మెట్రోన్యూస్, ఇబ్రహీంపట్నం:** ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 27 న 11గంటల నుండి తలపెట్టిన మహా ధర్నా కార్యక్రమం అనుమతి కొరకు రంగారెడ్డి జిల్లా అదనపు జిల్లా కలెక్టర్ కిరణ్మయి, ఫ్యూచర్ సిటీ జెయింట్ కమిషనర్ చందన దీప్తి ను కలసి వినతిపత్రంను టీజీజేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీజీజేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను జిల్లా కలెక్టర్ కి తెలియజేశారు. టీజీజేఏసీ రాష్ట్ర చైర్మన మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు, కార్యవర్గం తీసుకున్న నిర్ణయం మేరకు రంగారెడ్డి జిల్లా లో అన్ని వర్గాల ఉద్యగుల అభిష్టం మేరకు మహా ధర్నా కార్యక్రమం శాంతియుతంగా అన్ని భాగస్వామ్య సంఘాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఉన్న ఉద్యోగులు పెద్దఎత్తున సమస్యల పరిష్కారం కొరకు కొంగర కాలన్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తరలి రావాలని పిలుపునిచ్చారు..

ఈ కార్యక్రమంలో టీజీజేఏసీ నాయకులు శ్రీనివాసరావు ,రంగయ్య , ఆనంద్ సింగ్, గోపాల్ నాయ,క్ వాణి శ్రీదేవి, అన్నపూర్ణ, తేజ ,గౌస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ దరఖాస్తుల పరిశీలన

## - ఆన్‌లైన్‌లో అన్ని వివరాలు

**హైదరాబాద్, :మెట్రో న్యూస్ :** ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన కొనసాగుతున్నదనీ, అందులో ప్రాథమికంగా అనర్హులుగా గుర్తించిన వారి నుంచి వచ్చిన అభ్యంతరాలను కూడా పరిశీలిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ విపి గౌతం తెలిపారు. ఈ ప్రక్రియ మంగళవారం సాయంత్రం వరకు కొనసాగుతుందనీ, ముందు ప్రకటించిన విధంగా 25 వ తేదీ సాయంత్రం వరకు అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో వెల్లడిస్తామని పేర్కొన్నారు. అవుటర్ రింగ్ రోడ్ లోపలి వైపు ఉన్న 16 అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజల నుంచి ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ కోసం డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతాల్లోని ఇండ్ల కోసం 60,720 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రాథమిక పరిశీలన అనంతరం అనర్హులుగా గుర్తించిన వారందరికి సమాచారం పంపించామని, 24వ తేదీ సాయంత్రం వరకు వారి నుంచి అభ్యంతరాలను స్వీకరించామన్నారు. ప్రధానంగా నగరంలో స్థిర నివాసం ఉండకపోవడం, ఇప్పటికే ఇండ్లు లేదా ఫ్లాట్ కలిగి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు.

దరఖాస్తుదారుల్లో ఫోర్ వీలర్స్ ఉండి వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్న వారిని అనర్హులుగా పరిగణించామని, క్యాబ్ లుగా వినియోగిస్తున్న దరఖాస్తు దారులను అర్హులుగా గుర్తిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనర్హులుగా గుర్తించిన వారి నుంచి వచ్చిన అభ్యంతరాలన్నిటినీ కూడా పరిశీలిస్తున్నామని, వాటన్నిటిని పరిష్కరించిన తరువాత అర్హులైన వారి తుది జాబితాను ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి అపోహలకు, అనుమానాలకు లోను కావద్దనీ ఆయన సూచించారు. దరఖాస్తు స్థితిగతులను తెలుసుకోడానికి ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగవద్దనీ, అన్ని వివరాలను వెబ్ సైట్ లో అందుబాటులో తెస్తామని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు దారులకు ఏమైనా సందేహాలుంటే, కాల్ సెంటర్ నెంబరు 040246 03572లో సంప్రదించాలని సూచించారు.

# పదవుల కేటాయింపుపై టీపీసీసీ చీఫ్ అసంతృప్తి

## - లిస్ట్ ఇవ్వడంలో జాప్యంపై ఆగ్రహం..

**హైదరాబాద్: మెట్రో న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన నేతలకు నామినేటెడ్, పార్టీ పదవులు కేటాయించే ప్రక్రియలో జాప్యం కొనసాగుతుండటంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అసంతృప్తి వ్యక్తం చేశారు పదవుల భర్తీకి సంబంధించి జిల్లాల వారీగా అభిప్రాయాలు, ఆశావహుల వివరాలు సేకరించి తుది జాబితా సిద్ధం చేసి అధిష్ఠానానికి పంపడంలో జరుగుతున్న ఆలస్యంపై ఆయన పార్టీకి చెందిన మంత్రులు ఎమ్మెల్యేలపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ వేగం పుంజుకుందని, పార్టీ కోసం కష్టపడిన పాత క్యాడర్‌కు70 శాతం కొత్త క్యాడర్ కు 30శాతం ప్రాధాన్యం ఇచ్చేలా జాబితా తయారు చేయాలనీ ఆయన సూచించారు. పదవుల కోసం పెద్ద సంఖ్యలో నేతలు ఆశలు పెట్టుకోవడంతో.. ఎవరికి ఏ పదవి ఇవ్వాలన్న అంశంపై కాంగ్రెస్‌లో తీవ్ర కసరత్తు జరుగుతోంది. ఒక్కో ఉమ్మడి జిల్లాకు పలువురు ఆశావహులు ఉండటంతో సమీకరణాలు పార్టీ నాయకత్వానికి సవాల్‌గా మారాయి. ఇప్పటికే జిల్లా స్థాయిలో అభిప్రాయ సేకరణ, సమన్వయ సమావేశాలు నిర్వహించినా తుది జాబితా బయటకు రాకపోవడం నేతల్లో అసంతృప్తికి కారణమవుతోందని మహేష్ గౌడ్ అభిప్రాయ పడ్డట్టు తెలుస్తోంది.

పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన పాత క్యాడర్‌కు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యతను గుర్తెరుగాలని ఆయన సూచించారు.

పదవుల భర్తీ మరింత ఆలస్యమైతే క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన టీపీసీసీ నాయకత్వంలో సూచనల ద్వారా కనిపించింది ఇప్పటికే పార్టీలో అంతర్గత విభేదాలు, నేతల మధ్య బహిరంగ విమర్శలు అధిష్ఠానానికి ఇబ్బందికరంగా మారుతున్న నేపథ్యంలో.. పదవుల కేటాయింపును కూడా వివాదానికి దారితీయకుండా పూర్తి చేయాలని నాయకత్వం భావిస్తోంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ పార్టీ క్రమశిక్షణ, సమన్వయంపై ఇటీవల స్పష్టమైన వైఖరి వ్యక్తం చేసిన విషయం విదితమే.

# రైల్వే భద్రతపై సమీక్ష

## - జీ ఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

**హైదరాబాద్ : మెట్రో న్యూస్ :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జోన్ పరిధిలో రైలు కార్యకలాపాల భద్రతపై సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు వివిధ శాఖల ప్రధాన అధిపతులు హాజరయ్యారు. సికింద్రాబాద్ , హైదరాబాద్ మరియు నాందేడ్ మూడు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డిఆర్‌ఎంలు) వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా పాల్గొన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, నెలలో వివిధ శాఖల అధికారులు నిర్వహించిన రాత్రి తనిఖీలను సమీక్షించి, ఏవైనా లోపాలు కనుగొనబడితే వెనువెంటనే సవరణ చర్యలు చేపట్టాలని సూచించారు. సురక్షితమైన, సజావైన రైలు కార్యకలాపాలను నిర్ధారించడానికి, ముఖ్యంగా ఓహెచ్‌ఈ / విద్యుత్ పరికరాల వద్ద పనిచేసే క్షేత్ర స్థాయి, కాంట్రాక్ట్ సిబ్బందికి భద్రతా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించడంపై క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరాన్ని కూడా ఆయన నొక్కి చెప్పారు. ఏదైనా పని చేసేటప్పుడు కార్యస్థల రక్షణపై నిరంతరం దృష్టి పెట్టడం, వివిధ విభాగాల మధ్య సజావైన సమన్వయం యొక్క ప్రాముఖ్యతనుజనరల్‌మేనేజర్ పునరుద్ఘాటించారు. జనరల్ మేనేజర్ సిబ్బందికి క్రమం తప్పకుండా రిఫ్రెషర్ కోర్సులు నిర్వహించాలని, తద్వారా తాజా భద్రతా ప్రమాణాలు, నియమ నిబంధనలు, నిర్వహణ విధానాలపై సిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండేలా చూడాలని సూచించారు.

అలాగే, స్టేషన్లు రైళ్లలో, గూడ్స్ షెడ్లలో మరియు ఇంటర్‌లాకింగ్ లేని లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పరిస్థితిని కూడా సమీక్షించారు. అంతే కాకుండా జోన్ వ్యాప్తంగా కొనసాగుతున్న వివిధ పనుల స్థితిని జనరల్ మేనేజర్ సమీక్షిస్తూ ఈ పనులను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# కలం నుంచి కమలం వరకు జర్నలిస్టుగా జీవితం

## జర్నలిస్టులకు నాయకత్వం బీజేపీ అధికార ప్రతినిధిగా రాజకీయం కప్పర ప్రసాద్ రావు ప్రస్థానం

**హైదరాబాద్, మెట్రో న్యూస్ :** కలం పట్టిన చేతి నుంచి రాజకీయ వేదికపై మైక్ పట్టే వరకు సాగిన ప్రయాణం సాధారణమైనది కాదు. వార్తను రాసిన అనుభవం.. వ్యవస్థను దగ్గరగా చూసిన అవగాహన.. ప్రజా సమస్యలను అర్థం చేసుకున్నదృష్టి.. ఇవన్నీ కలిసినప్పుడు ఒక జర్నలిస్టు, కేవలం వార్తా రచయితగా జర్నలిస్ట్ గా మిగలడు. ప్రజా సమస్యలపై తన గొంతును వినిపించే నాయకుడిగా మారతాడు. అలాంటి భిన్నమైన ప్రయాణానికి ప్రతిరూపంగా నిలిచే పేరు కప్పర ప్రసాద్‌రావు. మెతుకు సిమగా పేరొందిన ఉమ్మడి మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మండలం తిగుల్ నర్సాపూర్ కు చెందిన కప్పర ఆర్ ఎస్ ఎస్ భావజాలం తో ఉండి విద్యార్థి పరిషత్ నాయకుడిగా ఎదిగాడు భారతీయ జనతా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహారించాడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం లో కీలకంగా పాల్గొన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ స్థాపించి జర్నలిస్ట్ సమస్య లపై రాజీ లేని పోరాటం నేటికీ సాగిస్తున్నారు. జర్నలిజంతో జీవితాన్ని ప్రారంభించిన ప్రసాద్‌రావుకు వార్తకేవలంవృత్తి కాదు.. సమాజాన్ని అర్థం చేసుకునే ఒక సాధనం. రాజకీయాలు, ప్రజా సమస్యలు, పరిపాలన, సామాజిక పరిణామాలను దగ్గరగా పరిశీలించే అవకాశం జర్నలిజం ఆయనకు కల్పించింది. ఒక అంశాన్ని కేవలం పైపైన చూడకుండా.. దాని వెనుక ఉన్న కారణాలను విశ్లేషించే అలవాటు ఆ దశలోనే ఆయనకు ఏర్పడింది. జర్నలిస్టుగా పని చేసే సమయంలో సంపాదించిన అనుభవం తరువాతి రాజకీయ ప్రస్థానానికి బలమైన పునాదిగా కప్పర ప్రసాద్ రావు కు మారింది.

వృత్తిపరమైన అనుభవాన్ని వ్యక్తిగత ఎదుగుదలకే పరిమితం చేయకుండా జర్నలిస్టుల సమస్యలపై కూడా గళం విప్పడం ఆయన ప్రయాణంలో మరో ముఖ్యమైన కోణం. జర్నలిస్టుల హక్కులు, వృత్తిపరమైన సమస్యలు, మీడియా రంగంలో ఎదురవుతున్న సవాళ్లపై మాట్లాడే క్రమంలో ఆయన జర్నలిస్టు నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోమెదక్‌జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్‌ప్రధానకార్యదర్శిగాపని చేశాడు. కప్పర ప్రసాద్‌రావు ప్రస్థానాన్ని ఒక వాక్యంలో చెప్పాలంటే వార్తను రాసిన కలం. ఇప్పుడు రాజకీయ వాదనను రాస్తున్న స్వరం అని చెప్పొచ్చు. జర్నలిజం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన అనేక మందిలో కొందరు మాత్రమే తమ వృత్తి అనుభవాన్ని రాజకీయ పాత్రకు బలంగా మలుచుకోగలుగుతారు. ఆ కోవలో కప్పర ప్రసాద్‌రావు ప్రయాణం ప్రత్యేకంగా కనిపిస్తుంది. జర్నలిస్టుగా సంపాదించిన అనుభవాన్ని జర్నలిస్టు నాయకత్వంగా, అక్కడి నుంచి రాజకీయ ప్రతినిధిత్వంగా మలుచుకున్న ఆయన ప్రస్థానం.. కలం నుంచి కమలం వరకు సాగుతోంది. జర్నలిస్ట్ గా పరిపక్వత పొంది, అదే జర్నలిస్ట్ లకు నాయకత్వం వహిస్తూ దేశం ఫస్ట్, పార్టీ నెక్స్ట్, వ్యక్తి లాస్ట్ అన్న సిద్ధాంత పరమైన బీజేపీ లో ఉన్న ఇంతితయి వటుడింతై అన్నట్టుగా కప్పర ప్రసాద్ రావు ఎదుగుతాడని ఆశిద్దాం...



# సర్ పై నిర్లక్ష్యం వద్దు .. శ్రేణులకు కీలక నేతల ఆదేశం

**హైదరాబాద్ ,మెట్రో న్యూస్ :** సర్ కార్యక్రమంలో చాలా చురుకుగా పాల్గొనాలని ఎక్కడ చిన్న నిర్లక్ష్యంగా కూడా ఉండొద్దని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పార్టీ కీలక నేతలు ఆదేశించారు. సోమవారం పార్టీ శ్రేణులతో ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లు జూమ్ సమావేశం నిర్వహించారు. 27వ తేదీన జరిగే ఓటర్‌గ్రామసభలుచాలాకీలకమని తెలిపారు.

గతంలో బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో సర్ వల్ల జరిగిన పరిణామాలను చూశామని జాగ్రత్తగా లేకపోతే నష్టపోతామని వారు తెలిపారు. అణమాలిస్, ఆన్ మ్యాపుడ్, ఆన్ డిజలైటయిడ్ ఓట్ల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటును పరిశీలించాలి. ఒక్క ఓటు కూడా నష్టపోవొద్దన్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు చాలా కీలకంగా పని చేయాలని డీసీసీ అధ్యక్షులు పూర్తి స్థాయిలో సర్ పని పూర్తి అయ్యే వరకు ఎలాంటి అలసత్వం లేకుండా నిమగ్నం కావాలన్నారు కాంగ్రెస్ ఓట్లను తొలగించే కుట్ర జరుగుతుందని అది గ్రహించి పూర్తి స్థాయిలో పని చేయాలని కోరారు. బిఎల్ఏలు సమగ్రమైన డేటాతో గ్రామ సభలలో పాల్గొని ప్రతి ఓటును పరిశీలించాలని మండల కమిటీలను ఈ నెలాఖరులోగా వేయాలని వారు సూచించారు. సహకార సంఘాల కమిటీలను కూడా ప్రతిపాదనలు పూర్తి చేయాలన్నారు. బీజేపీ కుట్ర చేస్తుందని ఎన్నికల కమిషన్‌ను అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేస్తుందన్నారు.

సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, సర్ కో ఆర్డినేటర్ గంప వేణుగోపాల్, టీపీసీసీ ఎన్నికల కమిషన్ చైర్మన్ రాజేష్ తదితరులు మాట్లాడారు. జూమ్ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్యేలు,పోటీ చేసిన ఎమ్మెల్యేలుపార్లమెంట్ సర్ కోఆర్డినేటర్లు అసెంబ్లీ సర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

27న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త గ్రామ సభ వార్డు సభల కోసం ప్రణాళిక మరియు సమన్వయం. డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు,పోటీ చేసిన ఎమ్మెల్యేలు, పార్లమెంట్ సర్ కో ఆర్డినేటర్లు, అసెంబ్లీ సర్ కో ఆర్డినేటర్లు, మండల, టౌన్,డివిజన్ అధ్యక్షులు, సూపర్‌వైజర్లు మధ్య సమన్వయం. సర్ ఫేజ్-11 పురోగతి మరియు పెండింగ్‌లో ఉన్న కార్యక్రమాలపైసమీక్ష జరిపారు.

## జర్నలిస్ట్స్ సంఘం నేత విరాహత్ అలీకి పలువురి పరామర్శ



**గజ్వేల్ : మెట్రో న్యూస్ :** మాతృ వియోగానికి గురైన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు, ఆయా రాజకీయ పార్టీల ప్రముఖులు, అధికారులు, ప్రజా సంఘాల బాధ్యులు, కార్మిక సంఘాలు, కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో గజ్వేల్ తరలివచ్చి పరామర్శిస్తున్నారు. ఇం దులో భాగంగానే సోమవారం నాడు నర్సాపూర్ శాసన సభ్యురాలు సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ అయోధ్య రెడ్డి, టీ షాట్ సీఈఓ వేణుగోపాల్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాధిక్, ప్రజాపక్షం పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బి. కిరణ్ కుమార్, స్నేహ విద్యాసంస్థల చైర్మన్ వి. సత్యనారాయణ, తెలంగాణ మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి, సిరిసిల్లా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎల్లారెడ్డి పేట మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవి, ఎఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తదితరులు విరాహత్ అలీని పరామర్శించి ఓదార్చారు.

మెట్రో ఈవినింగ్స్
హైదరాబాద్,
మంగళవారం,
ఆగస్టు 25, 2026



# తప్పించడమా..! వదిలేయడమా..!?



## సీఎం రేవంత్ రెడ్డి ముందున్న సమస్య!



(మెట్రో న్యూస్ బ్యూరో): బతకడమా... చావడమా! వేటు వేయాలా... వదిలేయాలా! ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరిగ్గా ఇదే సమస్యను ఎదుర్కొం టున్నారు. ఇటీవల రాజకీయ పరిణామాలపై ఆయన వైఖరి ఏమిటి..? తదుపరి చర్యలు ఏమిటి..? అనేది ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే అమెరికా పర్యటనకు కేంద్రం నో చెప్పడంతో అసహనంగా ఉన్న రేవంత్... కొందరు కాంగ్రెస్ నాయకుల తీరుతో ఆగ్రహంతో ఉన్నారు. ఇక మంత్రి కొండా సురేఖ కుటుంబం ఆయన్ను టార్గెట్ చేయడం భరించలేకపోతున్నారు! సీఎంకు అనుకూలురైన ప్రజాప్రతినిధులు అందరూ సురేఖను డిస్మిస్ చేయాల్సిందేనని పట్టుబడుతుండగా, సీనియర్ మంత్రులంతా జరుగుతున్న పరిణామాలను మౌనంగా గమనిస్తున్నారు. ఇవన్నీ ఆగస్టు

సంక్షోభం తాలూకు ప్రకంపనలేనా! ఈ విషయాన్ని మెట్రో ఈవినింగ్స్ దినపత్రిక ఇదివరకే చెప్పింది. నిరాష్ట్రంలో విపక్షాలపై ఒకవైపు పోరాటం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌కు మరోవైపు సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచీ అసమ్మతి పోటు తీవ్రమవుతోంది. మంత్రి సురేఖ కుటుంబం సభ్యులు, ముఖ్యంగా కూతురు సుస్మితా పటేల్ వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్‌ను కుదిపేశాయి. నేరుగా సీఎంనే సుస్మిత లక్ష్యంగా చేసుకున్నారు. బిడ్డ తిడితే... తల్లి సురేఖకు పార్టీ క్రమశిక్షణ సంఘం నుంచి నోటీసులు వెళ్లాయి. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కూడా ఈ వ్యవహారాన్ని తప్పుబట్టారు. కూతురు వ్యాఖ్యలతో తనకేం సంబంధం లేదంటూ... క్రమశిక్షణ సంఘానికి ఆమె లేఖలు రాయడమే కాకుండా.. నేరుగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతోనే భేటీ అయ్యారు. సీఎం విదేశాల్లో ఉండగానే... హైకమాండ్‌ను కలిసి వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేశారు. మంత్రి సురేఖ ఫ్యామిలీ ధిక్కార స్వరంపై ముఖ్యమంత్రి గుర్రుగా ఉన్నారు. ఇపుడు కూడా చర్యలు తీసుకోకపోతే... అసమ్మతి తారాస్థాయికి చేరి, పార్టీలో గందరగోళానికి దారితీస్తుందని సీఎం అనుయాయులు అధిష్టానంపై ఒత్తిడి పెంచుతున్నారు. మంత్రివర్గం నుంచి ఆమెను తప్పిస్తేనే.. రేవంత్ రెడ్డి ఆధిపత్యం కొనసాగుతుందని రాజకీయ విశ్లేషకుల మా! లేదంటే... సీఎం బలహీనమవుతారు అనేది పొలిటికల్ కామెంట్! మరి ముఖ్యమంత్రి మాట హైకమాండ్ వింటుందా... మంత్రి సురేఖపై వేటు పడుతుందా అనేది చూడాలి. మొత్తానికి బంతి గాంధీల కోర్టులోకి వెళ్లింది. పార్టీ పెద్దలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు ఈ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తారు అనేది ఆసక్తికరంగా మారింది.




మిస్ యూనివర్స్ ఇండియా 2026

## 19ఏళ్ల కేరళ యువతి కజియా

ఇంటర్నెట్ డెస్క్: కేరళకు చెందిన 19 ఏళ్ల కజియా లిజ్ మెజో 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' కిరీటం దక్కించుకుంది. జైపూర్‌లోని జీ స్టూడియోస్‌లో ఆదివారం జరిగిన గ్రాండ్ ఫినాలేలో ఆమె విజేతగా నిలిచింది. దేశవ్యాప్తంగా పోటీపడిన 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి టైటిల్ సొంతం చేసుకుంది. మిస్ యూనివర్స్ ఇండియా 2025 విజేత మానికా విశ్వకర్మ ఆమెకు కిరీటం అలంకరించారు. దీంతో నవంబర్‌లో ప్యూర్టోరికోలో జరిగే 75వ మిస్ యూనివర్స్ పోటీలో భారత్ తరఫున కజియా ప్రాతినిధ్యం వహించనుంది. కిరీటం దక్కిన అనంతరం కజియా ఆనందం వ్యక్తం చేసింది. ఈ కిరీటం కోసం మూడేళ్లకు పైగా కష్టపడ్డానని తెలిపింది. తన సొంత రాష్ట్రం కేరళకు ఈ విజయాన్ని తీసుకెళ్లడం ఎంతో గర్వంగా ఉందని చెప్పింది.

## సీఎం తో భట్టి భేటీ

హైదరాబాద్ (మెట్రోన్యూస్): విదేశీ పర్యటన ముగించుకుని సోమవారం హైదరాబాద్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. రా(ష్టానికి సంబంధించిన తాజా రాజకీయం, పాలనాపరమైన అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు, రానున్న రోజుల్లో తీసుకోవాల్సిన కీలక నిర్ణయాలపై సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిసింది.

## ఫీజు బకాయి.. బీజేపీ లడాయి



హైదరాబాద్ (మెట్రోన్యూస్): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ 48గంటల దీక్ష చేపట్టింది ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో 48 గంటల నిరాహార దీక్ష సోమవారం చేపట్టారు. ఫీజు బకాయి బీజేపీ లడాయి నినాదంతో ఈ ఆందోళన నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో సుమారు రూ. 12,000 కోట్ల నుంచి రూ. 15,000 కోట్ల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు ఆరోపించారు.

బకాయిలు రాక పోవడంతో కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లను ఆపుతున్నాయని, దీనివల్ల విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం ప్రభుత్వం ప్రకటించిన రూ. 2,000 కోట్ల అడ్వాన్స్‌ను కూడా పూర్తిగా విడుదల చేయడంలో విఫలమైందని ఆయన మండి పడ్డారు.



## హైదరాబాద్‌కు సీఎం
## స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

హైదరాబాద్ (మెట్రోన్యూస్): లండన్ పర్యటన ముగించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. సీఎం నగరానికి చేరుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు. రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



## అనుమతులు లేని భవనాలు కూల్చివేతకు ఆర్డర్స్

హైదరాబాద్ (మెట్రోన్యూస్): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనుమతులు లేని, నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 75 చదరపు గజాల లోపు స్థలంలో 7 మీటర్ల ఎత్తు మించి నిర్మించిన భవనాలు, 75 గజాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో అసలు అనుమతులే లేకుండా చేపట్టిన నిర్మాణాలను వెంటనే కూల్చేయాలని టౌన్ ప్లానింగ్, ఎన్ఫోర్స్మెంట్ టీమ్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ రోజు నుంచే ప్రతిరోజూ కూల్చివేతలకు రంగం సిద్ధమవుతోంది.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ముగురు నవజాత శిశువుల సజీవదహనం



ముంబై: మహారాష్ట్ర లో దారుణం జరిగింది. అమరావతి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ముగ్గురు శిశువులు మృతిచెందారు. నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో అగ్నిప్రమాదం జరగడంతో..ఈ విషాదం చోటుచేసుకున్నది. జిల్లా మహిళా ఆస్పత్రిలో ఈ ఘటన జరిగింది. ఆస్పత్రి మూడవ అంతస్తులో ఉన్న ఎన్ఐసీయూ వెంటిలేటర్‌లో స్పార్క్ రావడంతో ఈ ప్రమాదం సంభవించింది. తెల్లవారుజామున 3.15 నిమిషాలకు ఈ ఘటన జరిగింది. అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో.. డాక్టర్లు, నర్సర్లు, ఇతర సిబ్బంది.. ఎన్ఐసీయూలో ఉన్న శిశువులను రక్షించారు. కానీ ఆ ప్రమాదంలో ముగ్గురు శిశువులు ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. మరో ఆరు మంది శిశువులను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించారు.

## కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ భేటీ

హైదరాబాద్ (మెట్రోన్యూస్): కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ హైదరాబాద్ జలసౌధలో భేటీ అయ్యింది. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతోంది. తెలంగాణ ఈఎన్ సీ రమేశ్ బాబు, ఏపీ ఈఎన్ సీ నరసింహమూర్తి హాజరయ్యారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి పంపిణీపై ఈ భేటీలో చర్చిస్తున్నారు. పల్నాడు, రాయలసీమ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకుగానూ నీటి విడుదలపై చర్చించేందుకు త్రిసభ్య కమిటీని సమావేశపర్చాలని ఏపీ.. కృష్ణా బోర్డుకు లేఖ రాయగా తొలుత ఈ నెల 13న సమావేశం అయ్యేందుకు తేదీని నిర్ణయించారు.

## పెద్దపల్లిలో ఉగ్ర లింకుల కలకలం..

### ఎన్ఐఏ అదుపులో ఇంజినీరింగ్ విద్యార్థి

హైదరాబాద్ (మెట్రోన్యూస్): పెద్దపల్లి జిల్లాలోని రామగుండంలో ఉగ్ర లింకులు కలకలం రేపాయి. అయోధ్య నగర్‌లో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) తనిఖీల్లో ఈ విషయాలు బయటపడ్డాయి. ఈ క్రమంలో రామగుండానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్‌ను చీxూ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ముజామిల్ ఖాన్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ముజామిల్‌ను ఎన్ఐఏ అధికారులు.. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులతో విద్యార్థికి ఎలాంటి లింకులు ఉన్నాయి, పరిచయాలు, ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.
మూడేళ్ల క్రితం కూడా కరీంనగర్‌లో ఉగ్రలింక్‌లు బయటపడిన విషయం తెలిసిందే. ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయంటూ జగిత్యాలకు చెందిన వ్యక్తిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పుడు తాజాగా మరోసారి రామగుండంలో ఇంజినీరింగ్ విద్యార్థిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించడం, సోదాలు నిర్వహించడం సంచలనం రేపుతోంది.

## తెలంగాణలో విద్యార్థులకు ఏటా రూ. 12,000..

హైదరాబాద్ (మెట్రోన్యూస్): తెలంగాణలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించే ‹నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్› (చీవీమీా) పథకం 2026-27 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల గడువు సమీపిస్తోంది. అర్హులైన విద్యార్థులు ఆగస్టు 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులు 8వ తరగతి తర్వాత చదువును మధ్యలో ఆపకుండా ప్రోత్సహించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ. 1,000 చొప్పున, ఏడాదికి మొత్తం రూ. 12,000 ఆర్థిక సహాయం అందుతుంది. ఈ సహాయం 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు, అంటే మొత్తం నాలుగేళ్ల పాటు కొనసాగుతుంది. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3.50 లక్షలకు మించని విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. విద్యార్థులు 7వ తరగతిలో కనీసం 55 మార్కులు సాధించి ఉండాలి (ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు 5 మినహాయింపు ఉంటుంది).

## రూ. 12 లక్షలు ఎలుకలు తినేశాయి!



ఇంటర్నెట్ డెస్క్: యూపీలోని గోండా జిల్లాకు చెందిన ఓ మహిళ, ఇంటి ఖర్చుల నుంచి కొద్దికొద్దిగా డబ్బు పక్కన పెడుతూ వచ్చింది. అలా సుమారు ఎనిమిదేళ్లలో రూ. 12 లక్షల వరకు పొదుపు చేసింది. ఈ విషయం తన భర్తకు కూడా తెలియకుండా జాగ్రత్తపడింది. ఈ డబ్బును ఓ ట్రంకు పెట్టెలో భద్రపరిచింది. ఇటీవల, ఆ డబ్బుతో బంగారం ఆభరణాలు కొనాలని నిర్ణయించుకుంది. దీంతో ఎంతో ఆశతో ట్రంకు పెట్టెను తెరిచింది. కానీ లోపల దృశ్యం చూసి ఆమెకు గుండె ఆగినంత పనైంది. కరెన్సీ నోట్ల కట్టలను ఎలుకలు ముక్కలు ముక్కలుగా కొరికి పడేశాయి. చాలా నోట్లు పూర్తిగా నాశనమయ్యాయి. కుటుంబ సభ్యులు ఆ చిరిగిన నోట్ల మధ్యలోంచి పనికొచ్చేవాటిని వేరుచేసేందుకు ప్రయత్నించినా, పెద్ద మొత్తం నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో, ముఖ్యంగా ఎక్స్ లో వైరల్ అయింది.

# గ్యాస్ బండలు ఇక కనిపించవు...
# కేంద్రం భవిష్యత్తు ఆలోచనలు !

గ్యాస్ బండ అయిపోయింది అంటూ అంతా సాదా సీదాగా మాట్లాడుకోవడం అంతా చూస్తున్నదే. గ్యాస్ సిలిండర్లకు గ్యాస్ బండ మారు పేరు అన్న మాట. గ్యాస్ సిలిండర్లు ఎప్పటి నుంచి దేశంలో వాడుకలోకి వచ్చాయో కానీ వాటికి కాలం చెల్లబోతోంది అనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం తాజా ఆదేశాలతో అది ఎంతో దూరంలో లేదనిపిస్తోంది. ఇక మీదట వంట గ్యాస్ సిలిండర్లు అంటే ఎల్పీజీ మాయం అయి ఆ స్థానంలో పైప్ లైన్ల ద్వారా నడిచే గ్యాస్ పీఎన్‌జీ వినియోగం పెద్ద ఎత్తున అందుబాటులోకి రానుంది అని అంటున్నారు. ఎల్పీజీ చరిత్ర ఇదే : ఇదిలా ఉంటే మన దేశంలో వంట గ్యాస్ సిలిండర్ల వాడకం 1955 డిసెంబర్‌లో మొదలైంట్లుగా చరిత్ర చెబుతోంది. బరల్‌గాస్ పేరుతో ఇది ప్రారంభమైంది. ఆ తర్వాత 1965 అక్టోబర్ 22న కోల్‌కతాలో తొలి ఇండియన్ ఆయిల్ ఇండేన్ గ్యాస్ కనెక్షన్‌ను విడుదల చేశారు. 1967 హైదరాబాద్‌లోని అల్విన్ ఫ్యాక్టరీలో దేశీయంగా తొలి గ్యాస్ సిలిండర్ల తయారీ ప్రారంభమైంది. ఆ తరువాత వేగం పుంజుకుంది. 1980 నాటికి మధ్యతరగతి వర్గాలు పూర్తిగా ఎల్పీజీ వినియోగానికి మారిపోగా 2000 నుంచి పేదలు మొత్తం ఈ వైపుగా మారిపోయారు. దీంతో ఈ రోజున దేశంలో వంద కోట్ల కుటుంబాలు ఎల్పీజీ మీద పూర్తి స్థాయిలో ఆధారపడి జీవిస్తున్నారు. దాంతో ఎల్పీజీ సరఫరా మీద ఒత్తిడి బాగా పెరిగిపోయింది. అయితే ఎల్పీజీకి అవసరం అయిన ముడి చమురు పశ్చిమాసియా దేశాల నుంచి వస్తుంది. ఇటీవల అక్కడ సంక్షోభం యుద్ధ మేఘాల నేపథ్యంలో ఎల్పీజీకి కష్టాలు వచ్చాయి నాటి నుంచే కేంద్రం పీఎన్‌జీ మీద ఫోకస్ పెట్టింది. ఇబ్బందులు లేకుండానే : ఇక దేశంలో వంటగ్యాస్ సిలిండర్లపై ఆధారపడటాన్ని తగ్గించి పైప్‌లైన్ ద్వారా అందే గ్యాస్ పీఎన్‌జీ వినియోగాన్ని వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దిశగా పీఎన్‌జీ కనెక్షన్‌లను ప్రోత్సహించేందుకు సరికొత్త ప్రోత్సాహక పథకాలను తీసుకొచ్చింది. అందువల్ల భవిష్యత్తులో గ్యాస్ సిలిండర్ల అవసరం క్రమంగా తగ్గే అవకాశం ఉంది. పీఎన్‌జీ వైపు అడుగులు ఎంత వేగంగా పడితే అంత తొందరగా ఎల్‌పీజీ

కృషితోనాస్తి దుర్భిక్షం

మెట్రో ఈవినింగ్స్

4, హైదరాబాద్ మంగళవారం ఆగస్టు 25, 2026

## //ఎడిటోరియల్//

దిగుమతులపై భారాన్ని తగ్గించుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే పైప్‌లైన్ సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో పీఎన్‌జీ వినియోగాన్ని వేగవంతం చేస్తున్నారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు కేంద్రం ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రకటించింది. పైప్ ద్వారా గ్యాస్ అందడం వల్ల సిలిండర్లు మార్చే పని తప్పుతుంది. పీఎన్‌జీ కనెక్షన్ తీసుకున్న వారు ఎల్‌పీజీ సిలిండర్లను నిబంధనల ప్రకారం సరెండర్ చేయాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా ఈ మార్పును వేగవంతం చేయడానికి రాష్ట్రాలతో కలిసి యంత్రాంగం ఇప్పటికే పనిచేస్తోంది. కేంద్రం ఉత్తర్వులతో : ఇక ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా కీలక ఉత్తర్వులను జారీ చేసింది. ఎల్పీజీ నుంచి పీఎన్‌జీకి మార్పు వేగవంతం చేయాలని అన్ని రాష్ట్రాలను ఇందులో భాగస్వాములను చేయాలని కేంద్రం గట్టి నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో దేశంలోని ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారి నియామకానికి రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆదేశం జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం చూస్తే పీఎన్‌జీ కనెక్షన్ ఉన్నచోట తప్పనిసరిగా ఎల్పీజీ వాడకం నిలిపివేయాలని పేర్కొంది. ఈ ఆదేశాలను ఎక్కడైనా అతిక్రమిస్తే ఎల్పీజీ సరఫరా నిలిపివేసే అవకాశం కూడా ఉందని పేర్కొంది. దేశంలో ఇంధన భద్రతతో పాటు సురక్షిత వాడకం కోసమే కేంద్రం ఈ చర్యలను తీసుకుంటోంది అని అంటున్నారు. దీంతో కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ ఈ నెల 21న దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. పీఎన్‌జీ కనెక్షన్ల విస్తరణని వేగవంతం చేయాలని దాని కోసం సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు వినియోగదారుల మధ్య సమన్వయం కోసం జిల్లా స్థాయి పరిపాలనా వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని కూడా పేర్కొన్నారు. సొంత శక్తితోనే : ఇక పీఎన్‌జీ వినియోగాన్ని దేశంలో పూర్తిగా పెంచగలిగితే భద్రతతో పాటు పర్యావరణ హితంగా ఉంటుందని అంతే కాదు ముడి చమురు దిగుమతి కూడా తగ్గుతుందని భావిస్తోంది. కేంద్రం తాజా ఆదేశాలతో పీఎన్‌జీ సౌకర్యం ఉన్న ఇళ్లు ఎల్పీజీ కనెక్షన్‌ను ఎట్టి పరిస్థితుల్లో కలిగి ఉండకూడదు.

## విజ్ఞాన ధాతువు

మెట్రో డైలీ

ఎట్టి పుణ్యమొనరించనో నీ నేల
ఘన కీర్తి గలిగిన ఘనులు సంచరించే,
గిరుల దరులను నాటనాడే నీటి సోయగాలు,
గలగలా పారే సాగర ఒడిలో, బడిలో,
హృదయాంతరాల గడిలో,జడిలో,
జ్ఞానమొక్కటే మొక్కై నిలుస్తుంది,
వర్ణ భేదము నెరుగని అర్ణవము నొక నాదమై,
అక్షరం ఒకటే పలుకుతుంది,
ఎన్నాళ్ళు, ఎన్నేళ్లయిన వన్నె తగ్గని,
గిరి భూమి,సిరిభూమి,
సాగరపు ఆలల చూపుల్లో,
సందర్శనమిచ్చే జ్ఞాపకాల లోగిళ్ళలో,
వసుదైక కుటుంబ వాకిళ్ళలో,
కొండకోనలతో వెలసిన కోవెలలో,
నాటికీ,నేటికీ నీ పుడమి నడక,
మెరిసెను, మురిసెను
జ్ఞాన సరస్వతి దేవి ముక్కుపుడక,
ఎల్లలు లేని విద్యార్థి కలలు,కళల
చైతన్యాన్ని నింపేస్తుంది,
ఎచ్చోట నిలిచిన మంత్రోచ్చరణ శ్లోకాలు,
మది నిండిన మమతానురాగాలు,
ప్రకృతి పులకించే నిండు సాగరమందు
లిచిన ఆచార్య నాగార్జునుడి
పుణ్య ధరణి,శోభించే నరుడి బతుకు,
ప్రజ్వరిల్లే ప్రగతి జ్ఞాన సోపానాలు,
ఆత్మీయ కలయికలు, స్నేహబంధం,
చిగురించే మధురగీతాల జ్ఞాపకాలు,
ఉషోదయం, సూర్యాస్తమయం,
నేర్పించే జీవిత నిత్య సత్యాలు,
జ్ఞానార్జనకు పరితపించే,
విద్యార్థుల మనస్సుల పలకలపై
తీర్చిదిద్దిన గురువుల మనోఫలకం,
సృష్టికి మూలం జ్ఞానబీజం,
శాశ్వత చైతన్య తేజం,
నిత్య ప్రయోగశాలై ,
మనిషిలో వికసించిన విజ్ఞాన ధాతువు.



– అనంతుల సతీష్ కుమార్ (అస్)

# మహమ్మద్ ప్రవక్త బోధనలు-విశ్వ శాంతికి దారి దీపాలు

ప్రపంచవ్యాప్తంగా ముస్లిమ్ సమాజం దాదాపు 8వ శతాబ్దం నుంచి నిర్వహించుకునే అతి ముఖ్యమైన పర్వదినాల్లో ఒకటైన "మిలాద్ -అన్-నబి"కి ప్రత్యేకమైన స్థానం, ప్రాముఖ్యత ఉన్నది. 'మోలిద్ ' లేదా 'మీలాద్ 'అను పదాలు మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవంగా అత్యంత భక్తిశ్రద్ధలు, ఉత్సాహాల నడుమ జరుగుపుకోవడం అనాది నుంచి కొనసాగుతోంది. ఇస్లామిక్ చాంద్రమాన క్యాలెండర్ ఆధారంగా మూడవ నెల 'రబీ ఉల్ అవ్వల్' 12వ తేదీన వస్తుంది. ఈ పర్వదినానికి మోలిద్ -అన్-నబీ, మన్ లిద్ షరీఫ్, మోలుద్ షరీఫ్, ఈద్ -ఎ-మిలాద్ -ఉన్-నబవి లాంటి పలు పేర్లతో కూడా సూచిస్తారు. గ్రెగోరియన్ క్యాలండర్ ప్రకారం నెల వంక దర్శనం ఆధారంగా రోజున, అనగా 25/26 ఆగస్టు 2026 రోజున ఈ పండుగ వస్తున్నది. ముస్లిమ్ పౌర సమాజం ఈ పవిత్రమైన పండుగను మహమ్మద్ ప్రవక్త జన్మదినంగా నిర్వహించుకుంటూ, ఆయన బోధనలను స్మరించుకుంటూ, ఆయన సూచించినా మార్గంలో నడుస్తూ, ఆయనకు నివాళులు అర్పిస్తూ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. నినిమహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు వేడుకలు: ఇస్లామ్ మతాన్ని స్థాపించిన చివరి దూతగా పరిగణించబడే ప్రవక్త మహమ్మద్ పుట్టిన రోజును అతి గౌరవంగా, పరమ భక్తితో జరుపుకుంటారు. మహమ్మద్ ప్రవక్తను చివరి దూతగా ముస్లింలు ప్రగాఢంగా విశ్వసిస్తారు. దయ, కరుణ, దాతృత్వం, ధర్మబద్ధమైన జీవన విధానాలను పాటించడానికి ప్రవక్త మహమ్మద్ బోధనలు, ఆయన పవిత్ర జీవనం కూడా

ఉపయోగపడ్డాయి. ఖురాన్ పఠనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నివాసాల జిలుగులు వెలుగుల అలంకరణలు, మసీదులు లేదా దుర్గాల వద్ద ప్రార్థనలు, బహిరంగ సహపంక్తి విందులు, ప్రవక్త జీవన పారాయణాలు, రాత్రి ఊరేగింపులు, మత గురువుల ప్రవచనాలు లాంటి కోలాహలాల మధ్య ఈ పర్వదినం నిర్వహించుకుంటారు. మహమ్మద్ ప్రవక్తను విశ్వశాంతి కోసం అల్లాహ్ నియమించాడని వారి ప్రగాఢ విశ్వాసం. నినిమక్కాలో మహమ్మద్ ప్రవక్త

## మెట్రో తెలంగాణ చావడి




జననం:మహమ్మద్ ప్రవక్త అరేబియాలోని మక్కాలో జన్మించాడని నమ్ముతారు. ఆయన జననాలకి ముందు ప్రజలు అజ్ఞాన అంధకారాల్లో జీవించే వారని, ప్రవక్త జననం తర్వాత పౌర సమాజంలో సమూల మార్పులు రావడానికి మహమ్మద్ బోధనలు, జీవన విధానాలు ఉపయోగపడ్డాయి, చక్కటి మార్గనిర్దేశనం చేశాయి. ఈ పండుగ రోజున షీర్ కుర్మా, సెమియా స్వీట్లు అందరూ కలిసి ఆశ్వాదించడం, దాన ధర్మాలు చేయడం, మానవత్వాన్ని ఆచరించడం, ఐక్యతను సాధించడం, న్యాయ బద్ధంగా జీవించడం లాంటి పునాదుల మీద మన జీవితాలు కొనసాగాయని ప్రవక్త సూచించారు. మహమ్మద్ ప్రవక్త బోధనలను తూచ తప్పకుండా పాటిస్తూ మానవీయ కోణాన్ని అలవర్చుకొని మన జీవితాలను సుసంపన్నం చేసుకోవడానికి ప్రయత్నాలు చేద్దాం. ప్రవక్త చూపిన మానవీయ దారిలో జీవనయానం కొనసాగిద్దాం.

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

# శివుడికి విభూతి అంటే ఎందుకంత ఇష్టం?

శివారాధనలో విభూతికి ప్రత్యేక స్థానం- భౌతిక జీవితం, సంపదలు శాశ్వతం కాదనే ఆధ్యాత్మిక తత్వానికి ఇది ప్రతీక- శివుడి భస్మాభరణం, త్రిపుండ్ర ధారణతో పాటు విభూతి వెనుక ఉన్న ఆధ్యాత్మిక, తాత్విక విశిష్టత

మన పురాణాల ప్రకారం విష్ణువు అలంకార ప్రియుడు. శివుడు అభిషేక ప్రియుడు. కాసిని నీళ్లతో అభిషేకించి విభూతితో అలంకరిస్తే చాలు కోరిన వరాలను ఆ భోళాశంకరుడు అనుగ్రహిస్తాడు. అసలు పరమేశ్వరునికి విభూతికి ఉన్న సంబంధం ఏమిటి? శివునికి విభూతి అంటే ప్రీతి ఎందుకు? సనాతన ధర్మంలో వివరించిన విభూతి యోగం అంటే ఏమిటి? అనే ఆసక్తికర విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

దైవత్వానికి చిహ్నం: సాధారణంగా శివాలయాల్లో, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో, వినాయకుని ఆలయాల్లో విభూతిని ఇస్తుంటారు. అలాగే శివోపాసకులైన శైవులు ఎల్లప్పుడూ విభూతి ధరించి ఉంటారు. శివుడు అభిషేక ప్రియుడు. శివునికి అన్ని ద్రవ్యాల కన్నా విభూతితో అభిషేకిస్తే పరమ ప్రీతి చెంది వరాలు కురిపిస్తాడంట. విభూతిలో నిగూఢంగా ఉన్న దైవత్వమే ఇందుకు కారణమని అంటారు.

విభూతి యోగం: భగవద్గీతలోని 10వ అధ్యాయాన్ని విభూతి యోగం అంటారు. విభూతి అనగా భగవంతుని విశిష్టమైన ఐశ్వర్యం, మహిమ, అద్భుతమైన శక్తి అని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో వివరించారు. పరమేశ్వరునికి ప్రీతికరమైన ఈ విభూతి వెనుక దాగిఉన్న తత్వం ఏమిటో చూద్దాం.

విభూతే ఆభరణం!: పరమేశ్వరునికి ఆడంబరాలంటే నచ్చవు. ఆయన నివాసం మంచు కొండల్లోని కైలాసం. ఆయన



ఎల్లప్పుడూ శ్మశానంలో సంచరిస్తాడు కాబట్టి శ్మశానవాశి అనే నామధేయం కూడా ఉంది. శివుడు భౌతికమైన వస్త్రలు బదులు జంతు చర్మాన్ని ధరిస్తాడు. ఆభరణాలకు బదులు విభూతిని అలంకరించుకుంటాడు. ఈ విధంగా శివుడు విభూతిని ధరించడంలో ఆధ్యాత్మిక, తాత్విక పరమార్థాలు దాగి ఉన్నాయి. భగవంతుడికి ప్రాపంచిక ఆడంబరాలు, ఆభరణాలు అవసరం లేదని, ఆయన సకల భౌతిక బంధాలకు అతీతమైన వైరాగ్య స్వరూపుడని తెలియజేయడమే ఇందులోని అంతరార్థం.

## మెట్రో ఇలవేల్పు

# బ్రహ్మ, ఈశ్వరుడు కొలువైన దివ్యక్షేత్రం!



బ్రహ్మ తలరాతను రాస్తాడని, దాన్ని మార్చే శక్తీ ఎవరికీ ఉండదంటారు. కానీ, మీకు తెలుసా? పరమేశ్వరుడు స్వయంభువుగా కొలువై ఈ క్షేత్రాన్ని సందర్శిస్తే సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు రాసిన తలరాత మారుతుందని ఓ నమ్మకం. పైగా బ్రహ్మ స్వయంగా భక్తుల తలరాతల్ని తిరిగి రాస్తాడని, జాతక దోషాలను కూడా నివారిస్తాడనీ ప్రతీతి. ఇంతటి విశిష్టత కలిగిన ఈ టెంపుల్‌లో అటు శివుడితో పాటు ఇటు బహ్మనూ దర్శనం చేసుకోవచ్చు. ఇంతకీ, ఆ పుణ్యక్షేత్రం ఏంటి? ఇది ఎక్కడ ఉంది? ఎలా చేరుకోవాలి? అనే వివరాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.

మీరు తెలుసుకోవాలనుకుంటున్న ఆ మహిమాన్విత పుణ్యక్షేత్రమే ::బ్రహ్మపురీశ్వరర్ దేవాలయం::. సుమారు వెయ్యి సంవత్సరాల చరిత్ర గల ఈ క్షేత్రం తమిళనాడు తిరుచిరాపల్లిలోని తిరుపత్తూరు ప్రాంతంలో ఉంది. ఇక్కడ పరమేశ్వరుడు స్వయంభువుగా లింగరూపంలో దర్శనం ఇస్తే, బ్రహ్మ ధ్యానముద్రలో కమలాసనుడై, పసుపురంగులో కనిపిస్తూ పూజలు అందుకుంటున్నాడు. అందుకే ఈ ఆలయానికి రావాలనుకునే భక్తులు పసుపురంగు దుస్తుల్ని ధరించేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తారు. బ్రహ్మపురీశ్వరర్ క్షేత్రాన్ని కోచెంగనన్ చోళ అనే రాజు నిర్మించాడని, తర్వాత ఈ ప్రాంతాన్ని పాలించిన ఇతర పాలకులు దీన్ని అభివృద్ధి చేశారని చరిత్ర చెబుతోంది. ఇక్కడ శివయ్యతో పాటు అరుదైన బ్రహ్మదేవుడు కొలువుదీరడం వెనుక ఒక ఆసక్తికరమైన కథనం ప్రచారంలో ఉంది.

స్థలపురాణం ఏం చెబుతుందంటే?

సృష్టికర్త అయిన బ్రహ్మ, విశ్వం ఆవిర్భావానికి తానే కారణమని, సమస్త విశ్వాన్ని కూడా సృష్టించేది తానే కాబట్టి ఈశ్వరుడి కంటే తానే గొప్పవాడిననీ గర్వించాడట. అది తెలిసిన పరమశివుడు బ్రహ్మ గర్వాన్ని అణచివేసేందుకు ఐదో తలను ఖండించడంతోపాటు, సృష్టికర్తగా శక్తులన్ని కూడా కోల్పోతావంటూ శపించాడట. అప్పుడు అశక్తుడైన బ్రహ్మదేవుడు శాపవిమోచనాన్ని పొందేందుకు భూలోకానికి వచ్చి, శివాలయాలను సందర్శించాడట. అలా తిరుగుతూ ఇక్కడకు చేరుకుని ఈ ప్రాంతంలో పన్నెండు శివలింగాలను ప్రతిష్ఠించి, స్వామిని పూజించడం మొదలుపెట్టాడు. కొన్నాళ్లకు పరమేశ్వరుడు అనుగ్రహించి, దర్శనం ఇవ్వడంతో బ్రహ్మ శాపవిముక్తుడు అయ్యాడనేది ఐతిహ్యం. అలా ఆవిర్భవించిన శివుడు ఇక్కడే స్వయంభువుగా కొలువుదీరడంతోపాటు బ్రహ్మకూ తనతో సమానంగా దర్శన భాగ్యాన్ని కల్పించాడని స్థల పురాణం పేర్కొంటోంది. అందుకే ఈ క్షేత్రం బ్రహ్మపురీశ్వరర్‌గా ప్రసిద్ధి గాంచినట్లుగా ఈ కథ తెలియజేస్తోంది.

తెలుసా?ఒక్కసారి దర్శిస్తే తలరాత మారిపోతుంద!

బ్రహ్మపురీశ్వరర్ దేవాలయానికి వచ్చే భక్తులు ముందుగా శివయ్యను పూజించి, ఆ తర్వాత బ్రహ్మదేవుడి మందిరానికి వెళ్తారు. అక్కడ ధ్యానముద్రలో కొలువై ఉన్న బ్రహ్మ విగ్రహం భక్తులను ఆకట్టుకుంటుంది. పరశివుడు బ్రహ్మకు శాపవిమోచనాన్ని కల్పిస్తూనే, ఇక్కడకు వచ్చే భక్తుల తలరాతను మార్చే శక్తిని కూడా ప్రసాదించాడట. అందుకే, ఈ క్షేత్రాన్ని ఒక్కసారి దర్శించుకుంటే జాతకంలో ఎలాంటి దోషాలున్నా పోతాయని, బ్రహ్మ వాటిని నిర్మూలించి తలరాతను తిరిగి రాస్తాడని, జీవితం కొత్త మలుపు తిరుగుతుందని కూడా ఓ నమ్మకం. ముఖ్యంగా బ్రహ్మదేవుడికి పసుపుతో అభిషేకం చేస్తే మరీ మంచిదని చెబుతారు. అందుకే, ఇక్కడికి వచ్చే భక్తులు బ్రహ్మకు అభిషేకం చేయించడంతోనే ఆగిపోకుండా తమ సమస్యలు తీరాక, మరోసారి ఈ టెంపుల్‌ను సందర్శించి, పసుపురంగు వస్త్రలను మొక్కు రూపంలో సమర్పిస్తారు. ఇక, పార్వతీదేవి సంపత్ గౌరీ దేవిగా పూజలు అందుకునే ఈ టెంపుల్‌లోని బ్రహ్మతీర్థం చుట్టూ బ్రహ్మ ప్రతిష్ఠించిన పన్నెండు శివలింగాలను కూడా సందర్శించొచ్చు. అలాగే, ఈ క్షేత్రంలోనే యోగసూత్రాలకు ఆద్యుడైన పతంజలి మహర్షి జీవసమాధిని పొందాడట. అందుకు గుర్తుగా ఇక్కడ పతంజలి సమాధిని కూడా వీక్షించొచ్చు. ఇక, సుబ్రహ్మణ్యస్వామితోపాటు, గజలక్ష్మి, దుర్గ, విష్ణుమూర్తి తదితర దేవతామూర్తులూ కొలువుదీరిన ఈ పుణ్యక్షేత్రంలో ఏటా పదిరోజులపాటు అంగరంగవైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. అవి కాకుండా మహాశివరాత్రినాడు, కార్తికమాసంలో జరిపే ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు భక్తులు ఎక్కడెక్కడి నుంచో ఈ టెంపుల్‌గా వస్తుంటారు. అన్నింటికీ మించి, ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్ నెలల్లో మూడురోజులపాటు స్వయంభువు శివలింగంపైన సూర్యకిరణాలు పడే దృశ్యాన్ని వీక్షించేందుకు రెండుకళ్లూ చాలవు.

ఎలా చేరుకోవాలంటే?

బ్రహ్మపురీశ్వరర్ క్షేత్రానికి విమానంలో రావాలనుకునే భక్తులు తిరుచిరాపల్లి ఎయిర్‌పోర్టులో దిగాలి. అక్కడి నుంచి దాదాపు 35 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ టంపుల్‌ను చేరుకునేందుకు బస్సులు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి. ఒకవేళ ట్రైన్‌లో రావాలనుకునేవారు తిరుచిరాపల్లి రైల్వేస్టేషన్‌లో దిగాల్సి ఉంటుంది. అక్కడి నుంచి ఇంచుమించు 35 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ క్షేత్రానికి బస్సులు, ప్రైవేట్ వెహికల్స్‌లో వెళ్లొచ్చు.

మెట్రో ఈవినింగ్స్
METRO EVENINGS
కరీంనగర్-వరంగల్
పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల | హన్మకొండ, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్
epaper.metroevenings.com
తేది : మంగళవారం ఆగస్టు 25 2026


## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

**-- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**ఒకే ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి**

**మృతులకు నివాళు అర్పించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే**



మెట్రో న్యూస్ రాజన్న సిరిసిల్ల చందుర్తి మండలం లింగంపేట గ్రామ పరిధిలో శనివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం మృతి చెందిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు..రుద్రంగి మండల కేంద్రానికి చెందిన షాదుల్లా కుటుంబం వివాహ వేడుకకు హాజరయ్యేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన రక్తసంబంధీకులు నలుగురు మృతి చెందారు. ప్రమాదంలో షాదుల్లాతో పాటు ఆయన భార్య హాసీనా, మరో హాసీనా, పదో తరగతి చదువుతున్న చిన్నారి మృతి చెందడం బాధాకరమని విప్ పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించినప్పటికీ, పరిస్థితి విషమించడంతో ఒక్కొక్కరుగా మృతి చెందారని తెలిపారు.వేములవాడ పట్టణంలోనీ ఏరియా ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ మహేష్ బిగితే పరామర్శించారు

# పిల్లలకు పోషకాహార అల్పాహారం.. ఆరోగ్యమే లక్ష్యం

**మంథనిలో రూ.7.5 కోట్లతో సెంట్రలైజ్డ్ కిచెన్ ప్రారంభం**

**గంటకు 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీల తయారీ సామర్థ్యం**

**పిల్లలు ఆకలితో పాఠశాలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదు**

**మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**




మెట్రో న్యూస్ పెద్దపల్లి బ్యూరో. పిల్లలు ఆకలితో పాఠశాలకు వెళ్లకూడదని ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.మంథనిలో సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు రూ. 7.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యం, శారీరక ఎదుగుదలతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచేందుకు అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. కొడంగల్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ పథకం ద్వారా విద్యార్థుల హాజరు 21 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కొడంగల్, మధిరతో పాటు మంథనిలోనూ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు.మంథని సెంట్రలైజ్డ్ కిచెన్‌లో ఆధునిక యంత్రాల సహాయంతో గంటకు 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు తయారు చేసే సామర్థ్యం ఉందన్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ విభిన్న రకాల టిఫిన్లు అందించేలా ప్రత్యేక మెనూ రూపొందించామని, వారానికి కనీసం మూడు సార్లు పాలు అందించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు.ఏ విద్యార్థి కూడా ఆకలితో పాఠశాలకు రాకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు.కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. జిల్లాలో విద్యాశాఖకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. అల్పాహార పథకం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, హాజరు, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం, నాణ్యమైన విద్య ఉచితంగా అందుతున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసిల్దార్ ఆరిపోద్దిన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఆగష్టు 24, (మెట్రో న్యూస్) : జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించారు. ప్రజల నుండి అందుతున్న వినతులు, ఫిర్యాదుల స్వీకరణ విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యం




తో గత వారం నుండి మండల స్థాయిలో ప్రజా వాణి కార్యక్రమాలు ప్రారంభించింది.ఈ నేపథ్యంలో ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సానుభూతితో విని, శాఖల వారీగా సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు న్యాయం చేకూరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రమా దేవి, తహసీల్దార్ హకీమ్, సంబంధిత అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పశువైద్యశాలల్లో**

## సమయపాలన కరువు

**వైద్యుల గైర్హాజరు.. శిక్షణ విద్యార్థులతో చికిత్స.. బయట మందుల కొనుగోలుకు యజమానుల అవస్థలు**



కరీంనగర్, బ్యూరో చీఫ్, మెట్రో న్యూస్:కరీంనగర్ పట్టణంలోని ప్రభుత్వ పశువైద్యశాలల్లో వైద్య సేవలపై పశుపోషకులు, పెట్ యజమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పశువైద్యులు నిర్ణీత సమయపాలన పాటించడం లేదని, విధులకు ఇష్టానుసారంగా హాజరవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**వైద్యుల స్థానంలో శిక్షణ విద్యార్థులు?**

కొన్ని సందర్భాల్లో ప్రాక్టికల్ శిక్షణ కోసం వచ్చిన విద్యార్థులతోనే జంతువులకు వైద్యం చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అర్హత కలిగిన పశువైద్యుల పర్యవేక్షణలోనే చికిత్స అందించాల్సి ఉండగా, వైద్యులు అందుబాటులో లేని సమయంలో విద్యార్థులతో చికిత్స చేయించడం వల్ల సరైన రోగ నిర్ధారణ, చికిత్స అందడం లేదని పశువుల యజమానులు చెబుతున్నారు.అంతేకాకుండా, వైద్యం కోసం వచ్చిన పెట్ యజమానులతో శిక్షణ విద్యార్థులు దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**బయట మందుల కొనుగోలుకు తప్పని పరిస్థితి**

ప్రభుత్వ పశువైద్యశాలల్లో అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో బయట మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేయాల్సి వస్తోందని పశుపోషకులు ఆరోపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మందుల వివరాలను చీటీపై రాసి ఇవ్వడం, ప్రభుత్వ ప్రిస్క్రిప్షన్‌కు అవసరమైన కాగితాలు కూడా అందుబాటులో లేకపోవడం పరిస్థితికి అద్దం పడుతోందని వారు అంటున్నారు.

**రోగ నిర్ధారణ వివరాలు నమోదు చేయడం లేదన్న ఆరోపణలు**

జంతువులకు వైద్యం అందించే సమయంలో వ్యాధిని నిర్ధారించినప్పటికీ, ఆ వివరాలను కనీసం కేస్‌షీట్‌లో కూడా నమోదు చేయడం లేదని యజమానులు ఆరోపిస్తున్నారు. దీంతో తమ జంతువుకు అసలు ఏ వ్యాధి సోకిందో స్పష్టంగా తెలియడం లేదని వారు వాపోతున్నారు.

**పేట్ యజమాని లక్ష్మీనారాయణ ఆరోపణ**

తాను పోషిస్తున్న జంతువు అనారోగ్యానికి గురికావడంతో చికిత్స కోసం ప్రభుత్వ పశువైద్యశాలకు తీసుకువచ్చానని పేట్ యజమాని లక్ష్మీనారాయణ తెలిపారు.

**వైద్యాధికారి వివరణ**

ఈ ఆరోపణలపై సంబంధిత వైద్యాధికారిని వివరణ కోరగా, శిక్షణ విద్యార్థులు జంతువుల యజమానులతో దురుసుగా ప్రవర్తించినట్లు తమ దృష్టికి ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని, జంతువులకు చికిత్స అందించే సమయంలో యజమానులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలి**

ప్రభుత్వ పశువైద్యశాలలకు వచ్చే జంతువులకు అర్హత కలిగిన పశువైద్యుల పర్యవేక్షణలోనే వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు. వైద్యులు నిర్ణీత సమయాల్లో విధులకు హాజరయ్యేలా పర్యవేక్షణ పెంచాలని, ఆసుపత్రుల్లో అవసరమైన మందులను నిరంతరం అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎస్సార్.





భూపాలపల్లి ప్రతినిధి ఆగస్టు 24 మెట్రో న్యూస్. సోమవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలంలోని చెల్పూర్ శివారులో ఉన్న మెడికల్ కాలేజీ విద్యార్థుల కొరకు నూతనంగా నిర్మిస్తున్న హాస్టల్ భవన నిర్మాణ పనులను భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిర్మాణంలో ఉన్న ప్రతి గదిని సందర్శిస్తూ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హాస్టల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి సెప్టెంబర్ మొదటి వారంలోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. సుమారు 242 మంది విద్యార్థుల వసతి సౌకర్యార్థం నిర్మిస్తున్న ఈ హాస్టల్ భవనాన్ని నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. భవన నిర్మాణం పూర్తైన అనంతరం హాస్టల్ చుట్టూ ప్రహరీ గోడతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అవసరమైతే అదనపు నిధులు కూడా కేటాయించి విద్యార్థులకు మెరుగైన వసతి వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్,మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే

# కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

మెట్రో న్యూస్ రాయపర్తి ఆగస్టు 24: రాయపర్తి మండలంలో అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆహార భద్రత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి మామిడాల యశస్విని రెడ్డి వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఆహార భద్రత స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులు పారదర్శకంగా అందడమే కాకుండా, ప్రభుత్వ సేవలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.



ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలాలు చేరే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్ , ఎంపీడీవో శ్రీనివాస్ , వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ గారె



సంద్ర బిక్షపతి, వివిధ గ్రామాల సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యా నాయక్, మాజీ టీపీసీసీ కార్యదర్శి జిల్లా సుధీర్ రెడ్డి,మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు ముందు ప్రాధాన్యత ఇవ్వాలి




**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

వరంగల్, ఆగస్టు 24, 2026:మెట్రో ఈవినింగ్స్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఎస్ఐ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.
ఈ ప్రజావాణికి మొత్తం 145 దరఖాస్తులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు 42, జీడబ్ల్యూఎంసీ కి 26 , హౌసింగ్ శాఖకు 14, డిఆర్డివో 14, ఇతర శాఖలకు సంబంధించిన 49 దరఖాస్తులు వచ్చాయి. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ, సమగ్రంగా పరిశీలించి ముందు ప్రాధాన్యత తో త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ప్రజావాణిలో రెవెన్యూ, హౌసింగ్, జీడబ్ల్యూఎంసీ డీఆర్డివో పరిధిలోని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులే



అధికంగా వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి ఉదయం 10 గంటలకు ప్రారంభమైనదని అందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.నిరుద్యోగ సమస్యపై వచ్చిన వినతులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో టైలరింగ్‌లో ప్రావీణ్యం కలిగిన



వారికి టైలరింగ్ లో ఉపాధి అవకాశాలు కల్పించాలని సంబధిత శాఖల అధికారులను ఆదేశించారు

**రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం**

మండలాల పరిధిలో కూడా ప్రజావాణి నిర్వహించడం జరుగుతోందని, ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించి ఏదేని పెన్షన్ తదితర సమస్యలు పై మండల పరిధిలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డా. రాజారెడ్డి పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ వినతులను సమర్పించారు.

## సీనియర్ పాత్రికేయుడు ఇబ్రహీంకు ఘన నివాళి



రామన్నపేట మెట్రో న్యూస్:జర్నలిజంలో ఒక తరం ముగిసింది. పత్రికారంగంలో వివాదరహితుడిగా, నిబద్ధత కలిగిన పాత్రికేయుడిగా గుర్తింపు పొందిన సీనియర్ జర్నలిస్టు ఇబ్రహీం మృతి జర్నలిజం లోకానికి తీరని లోటని ప్రభుత్వ విప్,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. సోమవారం రామన్నపేట పాత్రికేయ బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇబ్రహీం సంతాప సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అనేక దశాబ్దాల పాటు వార్తా ప్రపంచంలో సేవలందించిన ఆయన మృతి పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ,ఆయనతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. వివాదరహిత జర్నలిజం,బహుముఖ అనుభవంఇబ్రహీం రెండు ప్రముఖ పత్రికలలో పనిచేసి తనదైన ముద్ర వేశారు. 2010 నుంచి ఆయనతో ఉన్న పరిచయాన్ని గుర్తుచేసుకుంటూ, హైదరాబాద్ లో నివసిస్తున్న కూడా ఆయన స్నేహపూర్వక బంధాన్ని కొనసాగించారని పేర్కొన్నారు. పత్రికా రంగంలో 50 సంవత్సరాలు పైగా ఒకే పత్రికలో పనిచేసిన గొప్ప వ్యక్తి ఎండి ఇబ్రహీం అని కొనియాడారు. ఆయన కుటుంబానికి మరియు పిల్లలకు ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ,ఆయన కుటుంబానికి తన వంతుగా,కాంగ్రెస్ పార్టీ తరపున ఎల్లవేళలా ఏ సహాయం కావాలన్నా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు,పున్న జగన్మోహన్,సిరిగి రెడ్డి మల్లారెడ్డి, ఎండి జమీరుద్దీన్, గంగుల వెంకట రాజారెడ్డి, పూస బాలకిషన్,గుత్తా నర్సిరెడ్డి, పోచబోయిన మల్లేశం, ఉట్కూరి నరసింహ,బొడ్డుపల్లి వెంకటేశం,వనం చంద్ర శేఖర్,మీర్జా ఫజల్ బేగ్,గోదాసు పృథ్వీరాజ్, ఎండి రెహాన్,ఎండి అక్రమ్,మోటే రమేష్,మిర్యాల మల్లేశం,సాల్వేర్ అశోక్,కందుల హనుమంతు,మండల పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## 25 నుండి సామూహికంగా మొక్కలు నాటే

# కార్యక్రమం చేపట్టాలి






### జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్.

నల్గొండ బ్యూరో, మెట్రో న్యూస్. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈనెల 25 నుండి సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి నాటిన ప్రతి మొక్క బతికేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వనమహోత్సవం పై జిల్లా కలెక్టర్లు, అటవీ ,దేవాదాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని , మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలోని నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలను వార్డులు , గ్రామాల వారీగా నాటేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు, వాటిని సంరక్షించడం అత్యంత ముఖ్యమని, నాటిన ప్రతి మొక్క బతికేలా అధికారులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని అన్నారు. అంతకుముందు రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున మొక్కలు నాటేందుకు ఉన్న అనుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకోవాలని,ఇందులో భాగంగా వనమహోత్సవం కింద ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టి సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని, వన మహోత్సవం ద్వారా అటవీ కవరేజీని మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు,ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని, మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను , మహిళా సంఘాలు, మున్సిపల్ చైర్మన్లు తదితరులను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని చెప్పారు. నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి టీజీ ఫారెస్ట్ పోర్టల్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలని , పట్టణ ప్రాంతాల్లో అటవీ విస్తీర్ణం తక్కువగా ఉన్నందున అక్కడ ఎక్కువగా మొక్కలు నాటాలని, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో విస్తృతంగా పచ్చదనం పెంచాలని ,ప్రతి ఇంటికి రెండు మొక్కలు అందించేలా చర్యలు చేపట్టడంతో పాటు, దేవాలయాల్లో ప్రత్యేకమైన మొక్కలు నాటాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

## ప్రపంచ వేదికపై గమన్ రెడ్డి స్వర్ణ సత్తా

### 8 దేశాల పోటీలో భారత్‌కు బంగారు పతకం




మెట్రోన్యూస్,(ఆగష్టు24)నేరేడుచర్ల: నేరేడుచర్లకు చెందిన బాల తైక్వాండో క్రీడాకారుడు కొణతం గమన్ రెడ్డి ప్రపంచ స్థాయి పోటీల్లో సత్తా చాటాడు.గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన 1వ వరల్డ్ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించాడు.ఎనిమిది దేశాల క్రీడాకారులు పాల్గొన్న పోటీల్లో భారత్ తరపున బరిలోకి దిగిన గమన్ రెడ్డి ప్రత్యర్థులను అధిగమించి విజేతగా నిలిచాడు.గమన్ రెడ్డి గత నాలుగేళ్లుగా కోచ్ సైకం సుబ్బారావు ఆధ్వర్యంలో తైక్వాండోలో శిక్షణ పొందుతున్నాడు.ప్రస్తుతం ఆరో తరగతి చదువుతున్న గమన్ రెడ్డి ఇప్పటివరకు 12 పతకాలు,అందులో 8 స్వర్ణాలు,4 రజతాలు సాధించాడు.తాజా విజయంతో కుటుంబ సభ్యులు,కోచ్‌లు,నేరేడుచర్ల ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.భవిష్యత్‌లో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



మెట్రో న్యూస్, (ఆగష్టు 24)సూర్యాపేట ప్రతినిధి: ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత కల్పించి ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, . ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంపై కూడా కలెక్టర్ సమీక్షించారు. మండల స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ నెల 25 నుండి జరుగు వనమహోత్సవం సందర్భంగా సంబంధిత జిల్లా అధికారులందరూ సామూహిక వనమహోత్సవంలో పాల్గొని వారికి నిర్దేశించిన టార్గెట్ పూర్తి చేయాలని, జిల్లా, మండల ప్రభుత్వ కార్యాలయాలలో ఆగస్టు 31 కల్లా టీ ఫైబర్ ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 43 దరఖాస్తులు, ఇరిగేషన్ 4, మున్సిపాలిటీ 4, డి డబ్ల్యు ఓ 3, మిగిలిన 14 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 68 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఎ పిడి సన్యాసయ్య, సిపిఓ కిషన్, డీఎస్ఓ మోహన్ బాబు, డిపిఓ యాదగిరి, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

### - 27వ తేదీన కలెక్టరేట్ ముందు నిరసన

### - మహాధర్నా జయప్రదం చేయాలని పిలుపు





భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(మెట్రో న్యూస్):ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన వారి పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీజేఈ జేఏసీ జిల్లా చైర్మన్ అమరనేని రామారావు, కన్వీనర్ సంగం వెంకట పుల్లయ్యలు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల ఉపాధ్యాయుల పెన్షనర్ల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27వ తేదీన మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నామని వారు వివరించారు. ఈ మేరకు వారు సోమవారం తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ప్రతినిధుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లకు నోటీసులు అందజేసినట్లుగా పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నా చౌక్ లో నిరసన కార్యక్రమం జరగనున్నదని చెప్పారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్' పిలుపునిస్తామని నాయకులు తెలిపారు. రెండవ పిఆర్‌సి నివేదికను వెంటనే సాధించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 6 డిఎలను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెండింగ్ బిల్లులను నెలకు రూ.2000 కోట్లు చొప్పున తక్షణమే చెల్లించాలని కోరారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ ను పకడ్బందీగా సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.వెంకటేశ్వర్లు, పెన్షనర్ల సంఘం నాయకులు వేస్లీ, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు రామ్ రవి తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాల్లో ప్రత్యేక

# వనమహోత్సవ కార్యక్రమం...

### రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

### వన మహోత్సవంలో నిర్దేశించిన లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి



ఖమ్మం మెట్రో ఈవెనింగ్ ఆగస్టు -24రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 25న మంగళవారం భారీ స్థాయిలో మొక్కలు నాటే ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల్లో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను, డిఎఫ్ఓ లను ఆదేశించారు.వన మహోత్సవ కార్యక్రమంపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఎఫ్ఓలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరంలో వన మహోత్సవం కార్యక్రమం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటి వరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. తక్కువ ప్రగతి సాధించిన జిల్లాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. మేడ్చల్ జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 9 శాతం లక్ష్యం మాత్రమే పూర్తయిందని, హెచ్ఎండీఏ, సూర్యాపేట, 3 గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లు, సంగారెడ్డి ప్రాంతాల్లో 50 శాతం కంటే తక్కువ లక్ష్యం పూర్తయిందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో లక్ష్య సాధనకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి వేగంగా మొక్కలు నాటాలని ఆదేశించారు.

వన మహోత్సవంలో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు. మొక్కల మనుగడ శాతం అధికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా మొక్కలు చనిపోతే వెంటనే వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటాలని అన్నారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, మొక్కల పరిస్థితిపై ప్రతిరోజూ పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ అనుకూల వాతావరణాన్ని పూర్తిగా వినియోగించుకొని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. సెప్టెంబర్ చివరి నాటికి అన్ని లక్ష్యాలను పూర్తి చేసేలా కలెక్టర్లు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.వన మహోత్సవంలో భాగంగా ఆగస్టు 25న మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో భారీ స్థాయిలో సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి, ప్రజా ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. మంగళవారం నిర్వహించే సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం ద్వారా జిల్లాలో చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమాలపై ప్రజలకు మంచి సందేశం వెళ్లేలా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు.ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను వ్యక్తిగతంగా ఆహ్వానించి కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో సాధ్యమైన చోట అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. దేవాలయ పరిసర ప్రాంతంలో, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో కూడా ప్రణాళికా బద్ధంగా మొక్కలు నాటాలని అన్నారు.బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని, అవసరమైన మొక్కలను సకాలంలో తరలించాలని, నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని మంత్రి ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి, మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు.మండల, గ్రామ స్థాయిల్లో కూడా ప్రత్యేకంగా మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, పాఠశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులను కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ మంగళవారం 1 లక్ష మొక్కలు నాటే లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. మండలాల వారీగా స్పష్టమైన లక్ష్యాలు కేటాయించి, ముందస్తు ప్రణాళికతో కార్యక్రమాన్ని నిర్వహించాలని డిఎఫ్ఓకు సూచించారు. కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, అన్ని వర్గాల ప్రజలను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీఆర్‌డీఓ బి. శిరీష, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యాదవులంతా ఐక్యంగా ముందుకు పోవాలి

### - సమస్యలను పరిష్కరించుకోవాలి

### - రాజకీయ పదవుల్లో యాదవులకు ప్రాధాన్యత ఇవ్వాలి



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(మెట్రో న్యూస్):యాదవులంతా ఐక్యంగా ముందుకు పోవడంతో పాటుగా ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవాలని అంతేకాకుండా రాజకీయ పదవుల్లో యాదవులకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగా సీతారాములు యాదవ్ అన్నారు. సోమవారం కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అఖిల భారత యాదవ మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగ సీతారాములు ప్రసంగించారు. యాదవులంతా కలిసికట్టుగా ఉండే తమ సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రంగాల్లో ముందున్నప్పుడే యాదవ కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులకు నాగ సీతారాముల తో పాటుగా కొత్తగూడెం మున్సిపల్ ఎక్స్ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్ యాదవ్ అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో యాదవకుల పెద్దలతో పాటుగా జిల్లా పెద్దలు గౌరవాధ్యక్షులు కోదాడ శ్రీనివాస్ యాదవ్, కౌడగాని శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు చిలక రవి యాదవ్, పట్టణ కమిటీ పెద్దలు వేల్పుల కుమార్ యాదవ్, అంబుల వేణు యాదవ్, బొమ్మిడి రమాకాంత్ యాదవ్, ఆవాల శ్రీనివాస్ యాదవ్, సకినాల సమ్మయ్య యాదవ్, యువత నాయకులు బొమ్మిడి శ్రీకాంత్ యాదవ్ జడల నాని యాదవ్ పాల్గొన్నారు.

**యాదవ యువజన నూతన కమిటీ..**

కొత్తగూడెం పట్టణ యాదవ యువజన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులుగా పల్లా దేవి వరప్రసాద్(డివిపి) యాదవ్, ఉపాధ్యక్షులుగా అద్దాల అశోక్ యాదవ్, ఆవాల సునీల్ యాదవ్, సురిమినేని హరీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కంచం మధు యాదవ్, కార్యదర్శులుగా అమృతవల్లి ప్రవీణ్ యాదవ్, బైకాను హరిప్రసాద్ యాదవ్, ముత్యాల అజయ్ యాదవ్, కోశాధికారిగా మీసా వేణు యాదవ్, సహాయ కోశాధికారిగా మామిడి శ్రీనివాస్ యాదవ్, కార్యవర్గ సభ్యులుగా కొంచెం సందీప్ యాదవ్, సభ్యులుగా జునుమాల వంశీ, జడల మధుబాబు కంచం సందీప్ లు ఉన్నారు.

మెట్రో ఈవినింగ్స్
METRO EVENINGS
మహబూబ్‌నగర్-మెదక్
నాగర్‌కర్నూల్ గద్వాల వనపర్తి నారాయణపేట సిద్దిపేట సంగారెడ్డి
epaper.metroevenings.com
తేదీ : మంగళవారం ఆగస్టు 25 2026 పేజి నెం. : 7

## ప్రజావాణి ఆర్జీలను పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్



జోగులాంబ గద్వాల, ఆగస్టు 24(మెట్రో న్యూస్) :ప్రజావాణిలో అందిన ఆర్జీలను పెండింగ్‌లో ఉంచ కుండా అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావుతో కలిసి ప్రజల నుంచి మొత్తం 66 ఆర్జీలను స్వీకరించారు.ప్రజలు సమర్పించిన దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ప్రజావాణి ఆర్జీలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా అధికారులు మండల స్థాయిలో ప్రజావాణి ఆర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని,మండల అధికారుల నుంచి ప్రతి వారం ఆర్జీల పరిష్కారంపై నివేదికలు తీసుకుని సమీక్షించాలని ఆదేశించారు. ఆర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.జిల్లాకు సంబంధించిన సెన్సస్ నివేదికలను సంబంధిత శాఖలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పక్కాగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం ఒక లబ్ధిదారునికి అదనపు కలెక్టర్ ట్రైసైకిల్‌ను అందజేశారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటి కలెక్టర్లు రాజ్ కుమార్,మనోజ్ కుమార్ రెడ్డి, ఏ.ఓ మంజుల, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## బల్మూర్‌లో రూ.146.71 కోట్ల రహదారి పనులకు శంకుస్థాపన చేసిన

# మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి





నాగర్ కర్నూల్ బ్యూరో:----(మెట్రో న్యూస్:ఆగస్టు 24) నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూర్‌లో రూ.146.71 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు నావీ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రహదారి పనులకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు.వనపర్తి-1 ప్యాకేజీ కింద అచ్చంపేట ఫేజ్-1లో ఈ పనులను చేపట్టనున్నారు.

**మూడు రహదారి పనులు ఇవీ**

రూ. రూ.32.99 కోట్లతో అమ్రాబాద్--తొల్పులపల్లి రహదారి:పదర,వాంకేశ్వరం, చిట్లముకుంట,ఉడిమిల్ల, ఇప్పలపల్లి గ్రామాల మీదుగా కిలోమీటర్ 0/000 నుంచి 34/200 వరకు రహదారిని బలోపేతం చేయనున్నారు. రూ.35.71 కోట్లతో బల్మూర్--నాగర్‌కర్నూల్ పీడబ్ల్యూడీ రహదారి,బల్మూర్, గోదల్, తుమ్మన్‌పేట గ్రామాల మీదుగా రహదారిని రెండు లేన్లుగా విస్తరించనున్నారు.రూ.78.01 కోట్లతో అచ్చంపేట--రాకొండ (ఉప్పునుంతల మీదుగా) రహదారి: ఉప్పునుంతల, మొల్గర, పెద్దాపూర్, మామిళ్లపల్లి,రాకొండ గ్రామాల మీదుగా రెండు లేన్లుగా విస్తరించనున్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి



మెట్రో న్యూస్ నారాయణపేట రూరల్ ఆగస్టు 24:ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రజా వాణి సమావేశ మందిరం లో సోమవారం నిర్వహించి న ప్రజావాణి కార్యక్రమానికి 14 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదా రులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ప్రజావాణి అర్జీల ను పెండింగ్ లో పెట్టకుండా సత్వరంపరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్క రించాలని కలెక్టర్ సూచిం చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డి.ఆర్.ఓ.రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికా రులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్,రేషన్ పంపిణీపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.

**అర్హులైన ప్రతి ఓటరుకు నోటీసులు అందాలి.**

**ధ్రువపత్రాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.**



నాగర్‌కర్నూల్ బ్యూరో:----(మెట్రో న్యూస్:ఆగస్టు 24) ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్లకు నోటీసుల పంపిణీ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ సరుకుల పంపిణీ తీరును జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు.మొదట బల్మూరు మండల కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు నోటీసుల పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించారు.సంబంధిత అధికారులు,సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో నోటీసుల పంపిణీని నిర్దేశిత నిబంధనల ప్రకారం పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరుకు సమాచారం అందేలా,ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు తమకు సంబంధించిన ధ్రువపత్రాలను తప్పనిసరిగా సమర్పించేలా చర్యలు తీసుకోవాలని,సమర్పించిన ధ్రువపత్రాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో విధిగా అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ బీఎల్ఓలను ఆదేశించారు.అనంతరం అచ్చంపేట పట్టణంలోని 12వ నంబర్ రేషన్ దుకాణాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.రేషన్ దుకాణంలోని సరుకుల నిల్వలు, పంపిణీ ప్రక్రియ,లబ్ధిదారులకు అందుతున్న రేషన్ వివరాలను పరిశీలించారు ముఖ్యంగా మూడు నెలలకు సంబంధించిన రేషన్ పంపిణీపై అధికారులు, రేషన్ డీలర్‌ను ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంతమంది లబ్ధిదారులకు రేషన్ అందించారు,ఇంకా ఎంతమందికి పంపిణీ చేయాల్సి ఉందనే వివరాలను తెలుసుకున్నారు.రేషన్ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ నిబంధనల మేరకు రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు రేషన్ పంపిణీని సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి,ఆయా మండలాల తహసీల్దార్లు,రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## పోలీస్ సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**-జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

**-పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తాం**

**-జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్**



మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:నూతనంగా ఎన్నికైన సంగారెడ్డి జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు సోమవారం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారంలో పోలీస్ అసోసియేషన్ కీలక పాత్ర పోషించాలని సూచించారు. ముఖ్యంగా పోలీస్ సాలరీ ప్యాకేజ్, ఆరోగ్య భద్రత, సిబ్బంది సంక్షేమానికి సంబంధించిన ఇతర అంశాలపై నిరంతరం దృష్టి సారించి, సిబ్బందికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేయాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్ మాట్లాడుతూ... పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం అసోసియేషన్ సభ్యులు అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల సూచనలు, ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటూ పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఎస్పీను కలిసిన వారిలో జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ. జనార్ధన్, ఉపాధ్యక్షుడు బి. రమేష్, రాజశేఖర్ రెడ్డి, ఎం. రాజారామ్, జి. సంతోష్ కుమార్, కూన రమేష్, అబ్దుల్ కరీమ్, టి. వెంకటేశం, జి. శ్రీనివాస్ పి. అరుణ కుమారి, అంగోథ్ రమేష్, ముజామిల్ ఉన్నారు.

## వన మహోత్సవం లక్ష్యాలను

# నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

**-రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**





మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం--2026 కార్యక్రమంలో భాగంగా జిల్లాలకు కేటాయించిన మొక్కల నాటే లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ వినయ్ కుమార్తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులు, డీఆర్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వన మహోత్సవం--2026 లక్ష్యసాధనపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... భావితరాలకు సమతుల్యమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను అధికారులు సమన్వయంతో పనిచేసి వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. అటవీ శాఖ నర్సరీల్లో తగినన్ని మొక్కలు అందుబాటులో ఉన్నందున, గుర్తించిన ప్రాంతాలకు అనుగుణంగా సరైన మొక్కలను ఎంపిక చేసి నాటాలని తెలిపారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నాటిన ప్రతి మొక్క బతికేలా చూడాలని సూచించారు. పశువులు, ఇతర జంతువుల నుంచి మొక్కలను రక్షించేందుకు అవసరమైన చోట్ల ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అర్బన్ ఫారెస్ట్ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ మొక్కలు పంపిణీ చేయాలని మంత్రి సూచించారు. దేవాలయాల ప్రాంగణాల్లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన మొక్కలను నాటేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం లక్ష్యం పూర్తయినప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో మొక్కల నాటే కార్యక్రమం ఆశించిన స్థాయిలో లేదని మంత్రి పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 25న (మంగళవారం) గ్రామ పంచాయతీ స్థాయి నుంచి పట్టణ ప్రాంతాల వరకు సామూహిక మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని జిల్లాల్లో పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లను భాగస్వాములను చేయాలని తెలిపారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ... జిల్లాలో వన మహోత్సవం--2026లో భాగంగా 34 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 21 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో అడిషనల్ కలెక్టర్ పాండు సమీక్ష నిర్వహించారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని రానున్న రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను సాధించేందుకు ఆయా శాఖలు సమగ్ర కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ సంస్థల పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటాలని, ముఖ్యంగా మున్సిపల్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో బండ్ ప్రాంతాల్లో ప్లాంటేషన్ చేపట్టాలని, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఈత మొక్కలు నాటాలని సూచించారు. ఆగస్టు 25న ప్రతి ప్రాంతంలో విస్తృతంగా మొక్కలు నాటి, కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను సంబంధిత అధికారులు షేర్ చేయాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు. జిల్లా వన మహోత్సవం లక్ష్యాన్ని వంద శాతం సాధించేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ జ్యోతి, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**-అదనపు కలెక్టర్లు సంగీత, పాండు**

**-కలెక్టరేట్ ప్రజావాణిలో 37 ఆర్జీలు**



మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు సంగీత, పాండు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ... ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్లు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా మొత్తం 57 ఫిర్యాదులు, వినతులు అందాయి. వీటిలో కలెక్టరేట్‌లో 37, సంగారెడ్డి డివిజన్‌లో 13, జహీరాబాద్ డివిజన్‌లో 3, నారాయణఖేడ్ డివిజన్‌లో 4 ఫిర్యాదులు, వినతులు అందాయి. అందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు, వినతులు అందలేదు. ప్రజావాణిలో అందిన వినతుల్లో ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్, ఈఈపీఆర్, మున్సిపల్, ఇంటర్మీడియట్, ఎంప్లాయ్‌మెంట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి దరఖాస్తు పరిష్కారానికి తీసుకున్న చర్యలను సంబంధిత రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెట్రో ఈవినింగ్స్
METRO EVENINGS
ఆదిలాబాద్-నిజామాబాద్
మంచిర్యాల | కామారెడ్డి
ఆసిఫాబాద్
నిర్మల్
epaper.metroevenings.com
తేది : మంగళవారం ఆగస్టు 25 2026 పేజి నెం. : 8


# అటవీశాఖ సిబ్బందికి నేర పరిశోధన , కేసుల దర్యాప్తుపై ఒక్కరోజు శిక్షణ





### -పోలీస్ కమీషనర్ వెల్లడి

నిజామాబాద్, ఆగస్టు 24( మెట్రోన్యూస్ )నిజామాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బందికి నేర పరిశోధన , కేసుల దర్యాప్తు , కోర్టు విచారణలో సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన అంశాలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం సోమవారం పోలీస్ కమీషనర్ కమాండ్ కంట్రోల్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు , సిబ్బందికి కేసుల దర్యాప్తును శాస్త్రీయంగా , సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పూర్తి చేయాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. కేసు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ దశ నుంచి దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేసే వరకు ప్రతి దశలో సత్వర చర్యలు తీసుకోవడం , నేరానికి సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం , నిందితులపై నేరం రుజువయ్యేలా పక్కా ఆధారాలను సేకరించడం వంటి అంశాలను వివరించారు. అలాగే భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బి ఎన్ ఎస్ ఎస్ ) , 2023లోని దర్యాప్తు , సాక్షుల విచారణ , శోధనలు , కేసులను మేజిస్ట్రేట్‌కు పంపడం , దర్యాప్తు పూర్తయిన అనంతరం నివేదిక సమర్పించడం వంటి నిబంధనలను సమర్థవంతంగా అమలు చేసే విధానాలపై శిక్షణ ఇచ్చారు. బి ఎన్ ఎస్ ఎస్ లో దర్యాప్తుకు సంబంధించిన సెక్షన్లు 176 నుంచి 193 వరకు , అలాగే సమన్లు , వారెంట్ల అమలుకు సంబంధించిన నిబంధనలు పొందుపర చబడ్డాయి. సాంకేతిక,శాస్త్రీయ ఆధారాల ప్రాధాన్యతపై కూడా ప్రత్యేకంగా వివరించారు. నేర స్థలంలో లభించే భౌతిక ఆధారాలు , డిజిటల్ ఆధారాలు , ఫోటోలు , వీడియోలు , సీసీటీవీ ఫుటేజీ తదితరాలను నిబంధనల ప్రకారం సేకరించి , వాటి సమగ్రతను కాపాడుతూ కేసు దర్యాప్తులో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేరానికి సంబంధించిన వస్తువులు , నమూనాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ ఎస్ ఎల్ )కు నిబంధనల ప్రకారం సురక్షితంగా పంపించడం , సరైన ప్యాకింగ్ , లేబులింగ్ , సీల్ , డాక్యుమెంటేషన్ , చైన్ ఆఫ్ కస్టడీ వంటి అంశాల్లో జాగ్రత్తలు పాటించడం ద్వారా కోర్టులో సాక్ష్యాల విలువను కాపాడుకోవాలని వివరించారు. అదేవిధంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో సాక్షులకు సమన్లు , నిందితులకు వారెంట్లు సకాలంలో అమలు చేయడం , వాటి అమలుపై నిరంతరం పర్యవేక్షణ చేయడం, కోర్టు విచారణకు అవసరమైన సాక్షులను సమయానికి హాజరుపరచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కేసు నమోదు చేయడం మాత్రమే కాకుండా, నేరం కోర్టులో నిరూపితమై నిందితుడికి చట్ట ప్రకారం శిక్ష పడే విధంగా దర్యాప్తు నాణ్యతను పెంచుకోవడం ప్రతి దర్యాప్తు అధికారికి ప్రధాన లక్ష్యం కావాలని సీపీ సూచించారు. అటవీ నేరాలకు సంబంధించిన కేసుల్లో పోలీస్ , అటవీశాఖల మధ్య సమన్వయం , శాస్త్రీయ దర్యాప్తు , సాంకేతిక పరిజ్ఞానం వినియోగం , న్యాయపరమైన ప్రక్రియలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా కేసుల దర్యాప్తు మరింత పటిష్టంగా , వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఎఫ్ఐఆర్ నమోదు నుంచి చార్జిషీట్ దాఖలు, సాక్ష్యాల సేకరణ, ఎఫ్ ఎస్ ఎల్ నివేదికలు, కోర్టు ప్రక్రియలు, సమన్లు--వారెంట్ల అమలు తదితర అంశాలపై అటవీశాఖ సిబ్బందికి ప్రాయోగిక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సి.సి.ఆర్.బి ఏసిపి బి. గురు నాయుడు , సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఆర్. అంజయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , మల్లేశం , ఎస్. ఐ జె. వరప్రసాద్ రెడ్డి , ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ బట్,ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్స్ , ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బాన్సువాడ ఆగస్ట్ 24 మెట్రో న్యూస్‌బాన్సువాడ పట్టణంలో ని టీచర్స్ కాలనీ కి చెందిన జల్సాని కిషోర్, తండ్రి రాజయ్య, వయసు 43 సంవత్సరాలు, కులం వైశ్య , వృత్తి ప్రైవేటు ఉద్యోగి, తేదీ 23.08. 2026 రోజున రాత్రి 11 గంటల సమయంలో తన వ్యక్తిగత పనులు ముగించుకొని తన యొక్క ఎలక్ట్రిక్ స్కూటీ పై ఇంటికి వెళు తుండగా మార్గ మధ్యలో బోధన్ రోడ్ లో గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వద్దకు రాగానే వర్షం కూడా పడటంతో తన యొక్క స్కూటీ ప్రమాదవశాత్తున అదుపుతప్పి కింద పడగా తలకు మరియు ఇతర శరీర భాగాలకు రక్త గాయాలయి అక్కడికక్కడే చనిపోయినాడు అని మృతుని భార్య అయిన సారిక ఇచ్చిన దరఖాస్తు పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినైనదని బాన్సువాడ స్టేషన్ హౌస్ అధికారి తెలిపారు.

## మండల ప్రజావాణికి 9 అర్జీలు




కోరుట్ల, ఆగస్టు 24 (మెట్రో న్యూస్) : కోరుట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 9 అర్జీలు వచ్చాయని ఎంపీడీవో వోదెల రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించిన అర్జీలలో రెవెన్యూ శాఖకు 3, మున్సిపాలిటీకి 3, పంచాయతీ శాఖకు 1, విద్యాశాఖకు 1, విద్యుత్ శాఖకు 1 అర్జీ చొప్పున వచ్చినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, వినతులు, అర్జీలను ప్రజావాణి కార్యక్రమం ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఎంపీడీవో సూచించారు.

## నిరాహార దీక్ష చేస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షునికి మద్దతు పలికిన బాన్సువాడ నాయకులు



బాన్సువాడ ఆగస్టు 24 మెట్రో న్యూస్‌రాష్ట్ర ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో శ్రీ ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్. స్కాల షిప్ బాకీలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్ రాంచందర్ రావు చేపడుతున్న 48 గంటల నిరహార దీక్షకు మద్దతుగా బాన్సువాడ పట్టణంలో ఫీజుల బకాయి - బీజేపీ లడాయి మీద ఈరోజు అంబేద్కర్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొనాల గంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ఉన్న 15000 కోట్ల రూపాయల విడుదల చేయకపోవడంతో 40 లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని చాలామంది విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేక చదువులను మధ్యలో ఆపేయడం జరుగుతుందని. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థుల యొక్క స్కాల షిప్ లను వెంటనే విడుదల చేసి విద్యార్థుల యొక్క చదువులు కొనసాగే లాగా చూడాలని లేనిచో బిజెపి ఆధ్వర్యంలో విద్యార్థుల యొక్క స్కాల షిప్ విడుదల చేసే వరకు విద్యార్థులచే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు చీదురు సాయిలు బిజెపి జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్ బిజెపి కౌన్సిలర్ గజ్జల మహేష్ బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి ఉమేష్ బిజెపి జిల్లా కౌన్సిల్ నెంబర్ తృప్తి ప్రసాద్ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి బిజెపి నాయకులు గురుకుల శ్రీనివాస్ లక్ష్మీనారాయణ చీకట్ల రాజు పాశం భాస్కర్ రెడ్డి శ్యామల శ్రీకాంత్ కొండని గంగారం పురుషోత్తం సచిన్ సందీప్ మహేందర్ ఫణిందర్. భూమేష్ లక్ష్మణ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు

## ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు/వార్డు సభలు



జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24 (మెట్రో న్యూస్) : ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు/వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం ఎస్.ఐ.ఆర్. (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహింస్తున్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. సత్య ప్రసాద్ , ఆర్.డి.ఓ.లు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు

## ప్రజావాణికి 103 ఫిర్యాదులు





నిజామాబాద్, ఆగస్టు 24 ( మెట్రోన్యూస్ )ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 103 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు/వార్డు సభలు




జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24 (మెట్రో న్యూస్) : ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు/వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం ఎస్.ఐ.ఆర్. (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహింస్తున్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. సత్య ప్రసాద్ , ఆర్.డి.ఓ.లు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

### ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 53




జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24 (మెట్రో న్యూస్) : ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 53 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ప్రజావాణికి సంబంధించి ప్రస్తుతం మొత్తం 182 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 93 దరఖాస్తులు 30 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా ప్రజావాణి నివేదికలో వెల్లడైంది. పెండింగ్ దరఖాస్తుల్లో జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద 28, జగిత్యాల మున్సిపాలిటీ వద్ద 23, జిల్లా ×డజూాణ వద్ద 17, ఌాణ ౹ూా= వద్ద 15, మెట్‌పల్లి మున్సిపాలిటీ వద్ద 10, కోరుట్ల మున్సిపాలిటీ వద్ద 9, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 9, ణ=ణూా వద్ద 9 దరఖాస్తులు ఉన్నాయి. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు పరిశీలించి, సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా 30 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతగా పరిష్కరించి, ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బి. ఎస్. లత, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

# మూఢనమ్మకంతో కన్న తల్లినే హత్య చేసిన ... ఇద్దరు కుమారులపై కేసు నమోదు



సైదాపూర్: ఎలబోతారం గ్రామంలో వృద్ధురాలు వెంకటమ్మ (80) అనుమానాస్పద మృతి కేసును సైదాపూర్ పోలీసులు ఛేదించారు. తల్లి తమ ఇంట్లో చనిపోతే ఇల్లు వదిలి వెళ్లాల్సి వస్తుందనే మూఢనమ్మకంతో ఆమెను వ్యవసాయ బావిలో పడవేసి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. వెంకటమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, పక్షవాతం కారణంగా సుమారు పది రోజులుగా మంచానికే పరిమితమయ్యారు. ఆమెను నలుగురు కుమారులు వంతుల వారీగా చూసుకునేవారు. ఈ క్రమంలో పెద్ద కుమారుడు నూనె సమ్మయ్య, చిన్న కుమారుడు నూనె శ్రీనివాసు కలిసి ఆమెను హత్య చేయాలని పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. ఇతర కుటుంబ సభ్యులు లేని సమయంలో వెంకటమ్మను ఇంటి నుంచి తీసుకెళ్లి సమీపంలోని వ్యవసాయ బావిలో పడవేసినట్లు దర్యాప్తులో నిర్ధారణకు వచ్చింది. అనంతరం ఆమె కనిపించడం లేదన్నట్లు నిందితులు వ్యవహరించి, ఆమె కోసం వెతుకుతున్నట్లు నటించారని పోలీసులు తెలిపారు. గ్రామంలో పలుమార్లు విచారణ చేపట్టి, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, సంఘటనకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. హత్యకు సంబంధించిన అంశాలు వెలుగులోకి రావడంతో దీచీూ సెక్షన్ 103(1), 238 తీ/ష 3(5) కింద నిందితులపై చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు హుజురాబాద్ రూరల్ సీఐ శ్రీనివాస్ వెల్లడించారు ఈ కార్యక్రమం లో ౹ా× స్వాతి హెడకానిస్టేబుల్ సంపత్ రెడ్డి మరియు పోలీసులు పాల్గొన్నారు...

# రైతులకు ఒక న్యాయం.. అధికారులకు ఒక న్యాయమా?

**- రైతులకు ఒక న్యాయం.. అధికారులకు ఒక న్యాయమా?**
**- పరిగి మార్కెట్ యార్డ్‌లో మున్సిపల్ అధికారుల నిర్వాకం**
**- కూరగాయలు అమ్ముకోకుండా ఖాళీ చేయించిన వైనం**
**- ట్యాక్స్ వసూలు చేసినా పరిశుభ్రతను విస్మరించిన అధికారులు**
**- తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వ్యాపారులు**





**పరిగి,ఆగస్టు 24 (మెట్రో న్యూస్):**పరిగి మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ యార్డ్ వేదికగా అధికారుల ద్వంద్వ వైఖరిపై స్థానిక రైతులు, వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో రైతులు తమ కూరగాయలను అమ్ముకోకుండా, ఇక్కడి నుంచి వెళ్ళిపోవాలంటూ మున్సిపల్ అధికారులు బలవంతంగా ఖాళీ చేయించారు. అయితే, ఇదే మార్కెట్ యార్డ్ వేలం (తైబజార్ పన్ను) కింద రైతుల నుంచి నిబంధనల ప్రకారం ట్యాక్స్ మాత్రం వసూలు చేయడం గమనార్హం.డబ్బులు వసూలు చేయడంలో చూపించిన శ్రద్ధను, మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచడంలో అధికారులు పూర్తిగా విస్మరించారని రైతులు మండిపడుతున్నారు. కూరగాయల వ్యర్థాలు, చెత్తాచెదారంతో మార్కెట్ యార్డ్ అధ్వాన్నంగా మారినా మున్సిపల్ సిబ్బంది కనీసం పట్టించుకోవడం లేదు. మార్కెట్ ప్రాంగణాన్ని శుభ్రం చేయకుండా అలాగే వదిలేయడంతో అక్కడి నుంచి తీవ్ర దుర్వాసన వస్తోందని, దీనివల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆం



దోళన వ్యక్తం చేస్తున్నారు.రైతులను ఖాళీ చేయించేందుకు ఉత్సాహం చూ పిన మున్సిపల్ అధికారులు, ప్రాథమిక బాధ్యత అయిన పరిశుభ్రతను ఎం దుకు గాలి కొదిలేశారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇప్ప టికైనా ఉన్నతా ధికారులు స్పందించి,పరిగి మార్కెట్ యార్డ్‌ను తక్షణమే శుభ్రం చేయిం చాలని, రైతులకు న్యాయం చేయాలని స్థానికులు, సిపిఐ (ఎమ్ .ఎల్ )న్యూ డెమోక్రసీ పరిగి డివిజన్ కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేసారు.

## ఇటుక లారీల ఓవర్‌లోడ్ పై కఠిన చర్యలు తీసుకోవాలి

**- సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిబంధనలు అమలు**
**- రెండు ఓవర్‌లోడ్ లారీలను పోలీసులకు అప్పగించిన అసోసియేషన్**



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** రెడ్ బ్రిక్స్ రవాణా చేసే లారీల్లో ఓవర్‌లోడ్‌కు అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రెడ్ బ్రిక్స్ సప్లై లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుర్జ నర్సింహా గౌడ్ తెలిపారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న రెండు రెడ్ బ్రిక్స్ లారీలను గుర్తించి ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా నర్సింహా గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రెడ్ బ్రిక్స్ రవాణా లారీల్లో పాసింగ్ సామర్థ్యానికి మించి సరుకు తరలించకుండా అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి ఒక్కో లారీలో గరిష్టంగా 35 టన్నులకు మించకుండా సరుకు రవాణా చేయాలని లారీ యజమానులు, డ్రైవర్లు, ఇటుక బట్టీల నిర్వాహకులకు సూచించినట్లు చెప్పారు. అలాగే అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కిషన్ గౌడ్ మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘించే లారీలపై ఎలాంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. దీంతో ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందన్నారు. రహదారుల పరిరక్షణ, వాహన దారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఓవర్‌లోడ్ రవాణాను పూర్తిగా నియంత్రించాలనే ఉద్దేశంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

**రెండు లారీలు పోలీసులకు అప్పగింత..**

ఇప్పటికే ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో రెండు రెడ్ బ్రిక్స్ ఓవర్‌లోడ్ లారీలను అప్పగించినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఓవర్‌లోడ్ వల్ల కలిగే నష్టాలు, నిబంధనల అమలుపై లారీ యజమానులు, డ్రైవర్లు, ఇటుక బట్టీల నిర్వాహకులకు ఇప్పటికే అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. కాబట్టి సెప్టెంబర్ 1 నుంచి నిబంధనలను కచ్చితంగా అమలు చేసి రెడ్ బ్రిక్స్ ఓవర్‌లోడ్ రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేస్తామని అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు దండిగా రమేష్ యాదవ్,బోల్గం నర్సింహా,బద్దుల కుమార్ గంగపురం జనార్దన్, రాజు నాయక్,బి.ఆంజనేయులు, కే. ప్రభాకర్, తొల రాజ్ కుమార్, మల్లె మహేష్,కొత్త దాసు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధన,రోడ్డు భద్రతపై అవగాహన

**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వాహనదారులు, వారి కుటుంబ సభ్యులకు ట్రాఫిక్ సీఐ జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం డివిజన్ ఏసీపీ కెపివి. రాజు పాల్గొని వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల డ్రైవింగ్‌పై నియంత్రణ, ఏకాగ్రత, నిర్ణయం తీసుకునే సామర్థ్యం తగ్గిపోతుందని ఏసీపీ తెలిపారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పూర్తిగా దూరంగా ఉండి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని వాహనదారులకు సూచించారు.

# అవినీతి, అక్రమాలు రాజ్యమేలుతున్నాయి

**- ప్రభుత్వ నియమ, నిబంధనలు ఇక్కడ ఏ మాత్రం వర్తించవు...**
**- డొమెస్టిక్ అనుమతులు కమర్షియల్ భవనం... నిబంధనలకు విరుద్ధంగా ఓ.సి..జారీ**
**- ప్రవైట్ వ్యక్తుల ఆదాయానికి భద్రత, భరోసా కల్పిస్తున్న టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు..**



**మెట్రో న్యూస్, రంగారెడ్డి :** నార్సింగి సర్కిల్ అవినీతి అక్రమాల్లో టౌన్ ప్లానింగ్ విభాగం మునిగి తేలుతుంది, టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతి గురించి మనం ఎంత చెప్పినా తక్కువే... అవినీతి, అక్రమాలు రాజ్యం మేలుతున్నాయి... అక్రమ నిర్మాణాలు ఆదాయ వనరులుగా మార్చుకుంటున్న టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు అందుకు ఎన్నో ఉదాహరణలు...నార్సింగి సర్కిల్ పరిధిలోని సర్వే నెంబర్ 165.. ప్లాట్ నెంబర్ 6, 6/ఏ.. ఓ నిర్మాణ దారుడు ప్రభుత్వం నుండి డొమెస్టిక్ అనుమతులు తీసుకొని.. కమర్షియల్ భవనంగా మార్చడం జరిగింది... అధికారులు కమర్షియల్ భవనంగా మార్చిన ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం... ఇక్కడి వరకు అక్రమ నిర్మాణ దారుడికి ...భద్రత, భరోసా కల్పించిన టౌన్ ప్లానింగ్ అధికారులు... అనంతరం సంబంధిత అక్రమ నిర్మాణ దారుడు ఓ.సి.కి దరఖాస్తు చేసుకోవడంతో... అధికారులు అన్ని విధాలుగా పరిశీలించి ... డొమెస్టిక్ తో, కూడిన ఓ.సి.ని.. జారీ చేయడం జరిగింది... ఒక వైపు అక్రమ నిర్మాణం మరో వైపు నిబంధనలకు విరుద్ధంగా ఓ.సి. జారీ చేయడం..దేనికి సంకేతం...ఈ అక్రమ నిర్మాణం, నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన ఓ.సి.పై , మే 25 తేదీన ఫిర్యాదు చేయడం జరిగింది... అధికారులు ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం... ప్రభుత్వ అధికారులుగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని గండి కొడుతూ ప్రైవేట్ వ్యక్తుల ఆదాయానికి భద్రత భరోసా కల్పిస్తున్న వైనం స్పష్టంగా కనిపిస్తుంది... టౌన్ ప్లానింగ్ అధికారులు... అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు అనడానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే.. నార్సింగి సర్కిల్ పరిధిలో , టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అంతులేని , అవినీతి ,అక్రమాలు అన్ని , ఇన్ని కావు... అందుకు ఎన్నో ఉదాహరణలు... మరి ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో మరో కథనంతో మీ ముందుకు...

# డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ స్నేహ మెహ్రా




**వికారాబాద్, మెట్రో న్యూస్ :**వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్పీ స్నేహ మెహ్రా, సోమవారం వికారాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా కార్యాలయ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, పరిశుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయ పరిసరాల్లో పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని నిరంతరం కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులు, ఫైళ్లు, కేసులకు సంబంధించిన పత్రాలను పరిశీలించి, వికారాబాద్ సబ్-డివిజన్ పరిధిలోని కేసుల స్థితిగతులను సమీక్షించారు. దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్ కేసులు, సీడీ ఫైళ్లు, కోర్టు కేసులు, వారెంట్లు, దర్యాప్తు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యతతో పాటు వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని, శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలను సేకరించాలని సూచించారు. జజుచీూ, వ-ూఖఎంష్ట్రఖ వంటి సాంకేతిక సాధనాలను సమర్థవంతంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తులో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు, అనుమానితులు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో భాగంగా బీట్ పోలీసింగ్, పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. నేరాలు జరిగే ప్రాంతాలు, సమయాలు, నేరాల స్వభావాన్ని విశ్లేషించి, అందుకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా దొంగతనాలు, మహిళలు మరియు బాలికలపై జరిగే నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.
ఈ వార్షిక తనిఖీలో వికారాబాద్ డీఎస్పీ, మోమిన్‌పేట్ సీఐ వెంకట్, సబ్-డివిజన్ ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 27న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు

**ముసాయిదా ఓటర్ల జాబితా, ఏఎస్‌డీ జాబితాను చదివి వినిపించాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



**వికారాబాద్, మెట్రో న్యూస్ :**ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో గ్రామ, వార్డు సభల నిర్వహణపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ భాగంగా ఈ నెల 27న అన్ని జిల్లాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించి, ముసాయిదా ఓటర్ల జాబితా, ఏఎస్‌డీ (అబ్సెంట్ , షిఫ్ట్ , డెత్ ) జాబితాలను బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్ల సమక్షంలో ప్రజలకు చదివి వినిపించాలని తెలిపారు.

**నోటీసుల పంపిణీ ప్రక్రియ త్వరలో పూర్తి**

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ, జిల్లాలో అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించిన నోటీసుల జనరేషన్ ప్రక్రియ దాదాపు పూర్తయిందని తెలిపారు. సంబంధిత నోటీసులను ఓటర్లకు మూడు రోజుల్లోగా అందజేసేలా చర్యలు




తీసుకుంటామని పేర్కొన్నారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, డీఆర్‌ఓ స్వర్ణలత, ఆర్డీఓ వాసుచంద్ర, ఎన్నికల సూపరింటెండెంట్ నేమత్ హాలి, సంబంధిత సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం: అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (మెట్రో న్యూస్ ):** ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారం కోసం పంపుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 75 దరఖాస్తులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**మెట్రో న్యూస్, చైతన్యపురి:** చైతన్యపురి డివిజన్ పరిధిలోని మారుతినగర్‌లో ఘనంగా బోనాల తొట్టెల పండుగ సందర్భంగా తొట్టెల ఊరేగింపు కార్యక్రమం డప్పు వాయిద్యాలతో ఎంతో అంగరంగ వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా యువకులు పిల్లలు నృత్యాలతో హోరెత్తించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి ఇక్కడ ఇదేవిధంగా తొట్టెల ఊరేగింపు కార్యక్రమం. కాలనీ వాసులు, పిల్లలు అందరూ బాగుండాలనే ఉద్దేశంతో ఈ తొట్టెల ఊరేగింపు కార్యక్రమం జరుపుతున్నామని.ఒక బోనాల పండుగనే కాకుండా ప్రతిపండగను కూడా ఎంతో ఘనంగా కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,నిఖిల్, సాయి,జలంధర్,పులి కిరణ్, నవీన్, శ్రావణ్,రాజు, కాలనీవాసులు పిల్లలు పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : సతీష్ ఆరోరా



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆర్.సతీష్ అరోరా అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీలోని టెంపుల్ బస్ స్టాప్ వద్ద తాడికొండ చందు నూతనంగా ఏర్పాటు చేసిన దక్షిన్ దాబాను సతీష్ ఆరోరా ముఖ్యఅతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేపీహెచ్‌బీ కాలనీ పరిసర ప్రాంతాల్లోని ఆహార ప్రియులకు నాణ్యతతో కూడిన రుచికరమైన ఆరోగ్యకరమైన మంచి క్వాలిటీ ఫుడ్ అందించి వారి మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనిల్ నిమ్కర్, బీఆర్ఎస్ పార్టీ వాణిజ్య విభాగం మాజీ అధ్యక్షులు బి.వలవల నాయుడు, డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.రాజేష్ రాయ్, తుమ్మల మోహన్, అనిల్ ప్రభృతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలి : ఈటెల



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలోని ప్రభుత్వ స్థలాల వేలాన్ని తక్షణమే నిలిపివే యాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేం దర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేపీహెచ్‌బీ రమ్య గ్రౌండ్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ ఈటెల మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాలను వేలం వేసే విషయంలో పునరాలోచన చేయాలని కాంగ్రెస్ సర్కార్‌కు సూచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వాలు భూములను ప్రైవేట్ సంస్థలకు విక్ర యించినా, లీజుకు ఇచ్చినా స్థానికులకు ఉద్యోగ అవకా శాలు కల్పించడం, ప్రభుత్వ భూములు ప్రజలకు తర తరాలుగా ఉపయోగపడే విధంగా ప్రణాళికాబద్ధంగా విని యోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కూకట్ పల్లి వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను పార్కులు, క్రీడా మైదానాలు, సీని యర్ సిటిజన్స్ క్లబ్‌హౌస్‌లు, ప్రజా అవసరాల కోసం కేటాయించాలని ఈటెల డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు, డివిజన్ కంటెస్టెడ్ కార్పొరే టర్ ఎస్.ప్రీతంరెడ్డి, మాజీ కార్పొరేటర్ కే.మహేందర్, శ్రీకర్ రావు, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యు.శివప్రసాద్, వినోద్‌గౌడ్‌ప్రభృతులు పాల్గొన్నారు.



ఏలూరులో నూతన మొక్కజొన్న ఆవిష్కరణ




ఏలూరు జిల్లా, ఆగస్టు 24 : మన ఉత్పత్తులు ప్రపంచానికి ఆదర్శం కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. భవిష్యత్తు అంతా స్టార్టప్‌లు, ఆవిష్కరణలదేనని పేర్కొన్నారు. (సోమవారం) ఏలూరు జిల్లాలోని కాట్రేనిపాడులో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు పర్యటించారు. ఉపరాష్ట్రపతితో కలిసి సీఎం చంద్రబాబు పాప్‌కార్న్ సీడ్‌ను ఆవిష్కరించారు. దేశంలో తొలి పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనం అమల్లోకి రానుంది. ముసునూరులో పాప్‌కార్న్ మెయిజ్ విత్తనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. తక్కువ కాలంలో విజయం సాధించడం గొప్ప విషయమని చెప్పారు. ఈ ప్లాంట్ 29 టన్నుల సామర్థ్యంతో.. ఆసియాలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రంగా నిలుస్తోందని వివరించారు.
భవిష్యత్తులో పాప్‌కార్న్ అంటే గుర్తొచ్చేది ముసునూరు అని సీఎం చంద్రబాబు తెలిపారు. 11 ఏళ్లలో మొక్కజొన్న ఉత్పత్తి వాటా 65శాతానికి పెరిగిందని అన్నారు. అన్ని దేశాలకు ఇక్కడి నుంచే పాప్‌కార్న్ పంపించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్తే.. వస్తువు విలువ చాలా రెట్లు పెరుగుతుందని వెల్లడించారు. స్వదేశీ విధానంతో స్వయం సమృద్ధి సాధించాలని చెప్పారు. ఈ నెల్లోనే పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీటిని విడుదల చేస్తామని తెలిపారు. వ్యవసాయానికి ఎల్‌నినో పెద్ద సమస్యగా మారిందని అన్నారు. ఇంకా 52 శాతం వర్షపాతం లోటుగా ఉందని తెలిపారు. గోదావరి, కావేరీ నదులు అనుసంధానం కావాలని ఆకాంక్షించారు. దేశంలో నదులు అనుసంధానం కావాలని కోరుకునే వ్యక్తి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అని కొనియాడారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలని ఉపరాష్ట్రపతి కోరుతున్నారని తెలిపారు. గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, కావేరి నదులను అనుసంధానం చేస్తే నాలుగు రాష్ట్రాల సమస్యలు సమసిపోతాయని పేర్కొన్నారు.

## శాస్త్రవేత్తలు కరవును తట్టుకునే విత్తనాలు తయారు చేయాలి



ఏలూరు: భారతదేశానికి రైతులే వెన్నెముక అని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. ఇతర రంగాల్లో సంక్షోభం ఉన్నా వ్యవసాయం దానిని స్థిరీకరించిందని పేర్కొన్నారు. వ్యవసాయం, దాని అనుబంధ ఉత్పత్తులు మన దేశ ఆర్థిక వ్యవస్థలో 17 శాతం ఉన్నట్లు గవర్నర్ తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలోని ముసునూరులో నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతోంది. గౌర్మెట్ పాప్‌కార్నికా ఫ్యాక్టరీ వేదికగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు కరవును తట్టుకునే విత్తనాలపై పరిశోధనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో 70 శాతం మొక్కజొన్న ఉత్పత్తులను అర్జెంటీనా, బ్రెజిల్ నుంచి దిగుమతి చేసుకునేవాళ్లమని అన్నారు. దీంతో అందుకు సంబంధించిన నగదు మొత్తం ఆయా దేశాలకు వెళ్లేదని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ మొత్తం మన దేశ రైతులకు వస్తోందని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు ఏలూరులో ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు మంత్రి లోకేశ్ ఘన స్వాగతం పలికారు. అనంతరం వారంతా ముసునూరుకు చేరుకున్నారు.
మరోవైపు, ఈ కార్యక్రమంపై ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ స్పందించారు. 'భారత గౌరవ ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు ఏలూరులో స్వాగతం పలకడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. భారతదేశపు మొట్టమొదటి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనం ఆవిష్కరణ కార్యక్రమంలో వారితో కలిసి పాల్గొనడానికి ఎదురుచూస్తున్నాం. ఇది మన రైతులకు నూతన ఆవిష్కరణలు, అధిక విలువ సృష్టించే దిశగా ఓ కీలక ముందడుగు' అంటూ పోస్టు చేశారు.



### ఆయుష్‌కి రూ.185.75 కోట్లు..
## కేంద్రం భారీ నిధుల ఆమోదం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆయుష్ వైద్య రంగానికి కేంద్ర ప్రభుత్వం మరొక ముఖ్యమైన తీపి కబురు అందించింది. ఏపీ ఆయుష్ విభాగం రూపొందించిన 2026-27 ఆర్థిక సంవత్సరపు వార్షిక ప్రణాళికకు రూ.185.75 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆయుష్ చరిత్రలోనే తొలిసారిగా 2024-25 నుంచి 2026-27 వరకు మూడేళ్ల కాలానికి కలిపి మొత్తం రూ.434 కోట్ల భారీ కేటాయింపులకు కేంద్రం నుంచి అనుమతి వచ్చిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జాతీయ ఆయుష్ మిషన్ ప్రారంభమైన నాటి నుంచి రాష్ట్రానికి లభించిన అత్యధిక వార్షిక కేటాయింపులు ఇవేనని ఆయన స్పష్టం చేశారు.
గతంలో 2014-15 నుంచి 2023-24 వరకూ పదేళ్ల కాలంలో ఆయుష్‌కు కేవలం రూ.120.17 కోట్లు మాత్రమే కేటాయించగా, ఇప్పుడు కేవలం మూడేళ్లలోనే భారీగా నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఐటీడీఏ గిరిజన ప్రాంతాల్లో 19 మొబైల్ మెడికల్ యూనిట్ల ఏర్పాటు, ఆయుష్ డిస్పెన్సరీల ఆధునికీకరణ, ఆల్కహాల్ డీ-అడిక్షన్ సెంటర్లు, యోగా వెల్నెస్ కేంద్రాల అభివృద్ధితో పాటు ప్రత్యామ్నాయ వైద్య సేవలను బలోపేతం చేయనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌తో రాష్ట్రంలో వైద్య రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని మంత్రి పేర్కొన్నారు.

## 3వేల డీఎస్సీ పోస్టుల భర్తీ.. మంత్రి లోకేశ్ ప్రకటన



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ ఏడాది డీఎస్సీ ద్వారా మరో 3,000 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయబోతున్నామని పాఠశాల విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి విద్యా రంగంలో వేగవంతమైన మార్పులు తీసుకువస్తున్నామని, ఇప్పటికే డీఎస్సీ ద్వారా 16,000 టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని గుర్తుచేశారు. అంతేకాకుండా, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10,000 పాఠశాలల్లో 'వన్ క్లాస్ - వన్ టీచర్' విధానాన్ని విజయవంతంగా అమల్లోకి తెచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు.
శనివారం విజయనగరం జిల్లా దాసన్నపేటలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడారు. విద్యావ్యవస్థలో ప్రభుత్వం తలపెట్టిన ప్రాథమిక సంస్కరణలు పూర్తయ్యాయని, ఇకపై ఉపాధ్యాయులంతా పూర్తిస్థాయిలో విద్యార్థుల అభ్యసనా ఫలితాలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

## హోం మంత్రి అనితపై కూలిన డ్రోన్

తిరుపతి, ఆగస్టు 24: అమరావతి ఛాంపియన్‌షిప్ 2026 ప్రారంభ వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. హోం మంత్రి వంగలపూడి అనితపై డ్రోన్ కూలడంతో కుడి చేతికి స్వల్ప గాయమైంది. అమరావతి ఛాంపియన్‌షిప్ కార్యక్రమంలో భాగంగా డ్రోన్‌ను ఎగురవేశారు. అయితే బ్యాటరీ ఛార్జింగ్ తగ్గిపోవడంతో డ్రోన్ కిందపోయింది. దీంతో అక్కడే ఉన్న హోంమంత్రి చేతికి డ్రోన్ తగలడంతో గాయమైంది. వెంటనే వైద్యసిబ్బంది అనితకు చికిత్స అందజేశారు. కాగా, (సోమవారం) ఉదయం అమరావతి ఛాంపియన్‌షిప్ 2026 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను హోంమంత్రి అనిత, మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్ ప్రారంభించారు. నేటి నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూల నుంచి దాదాపు పదివేల మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. పోటీల కోసం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ, పద్మావతి మహిళా యూనివర్సిటీ, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ సహా మొత్తం 9 వేదికలను అధికారులు సిద్ధం చేశారు. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విజయవాడలో అమరావతి ఛాంపియన్‌షిప్ ముగింపు వేడుకలు జరుగనున్నాయి.




### పర్యటనకు ఉపరాష్ట్రపతి..
## స్వాగతం పలికిన మంత్రి లోకేశ్



భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యటించారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలంలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన విచ్చేశారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా పాల్గొననున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ఉపరాష్ట్రపతి రోడ్డు మార్గాన ముసునూరుకు బయలుదేరి వెళ్లారు. ముసునూరు గ్రామంలోని 'గౌర్మెట్ పాప్‌కార్న్' పరిశ్రమ ప్రాంగణంలో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా, ఆ సంస్థ ఆధ్వర్యంలో పరిశోధించి అభివృద్ధి చేసిన దేశంలోనే మొట్టమొదటి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాన్ని ఉపరాష్ట్రపతి లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ విత్తనావిష్కరణ అనంతరం పాప్‌కార్న్ సాగు చేస్తున్న మొక్కజొన్న రైతులను ఉపరాష్ట్రపతి స్వయంగా సత్కరించారు. భారత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు ఇది ఒక ప్రధానమైన ఆవిష్కరణగా నిపుణులు భావిస్తున్నారు.
ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌లకు ఏలూరు జిల్లా పర్యటన సందర్భంగా స్వాగతం పలకడంపై మంత్రి నారా లోకేశ్ ఆనందం వ్యక్తం చేశారు. అన్నదాతల ఆర్థిక పురోగతి కోసం నూతన ఆవిష్కరణలు తీసుకురావడం, వారికి వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా మరిన్ని ప్రయోజనాలు చేకూర్చే దిశగా ఇది ఒక కీలకమైన ముందడుగు అని తన ప్రకటనలో పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా అధికారులు అత్యంత వేగంగా, యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్వయంగా ముసునూరులోని ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతాపరంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి, ఏలూరు రేంజ్ ఐజీపీ జీవీజీ అశోక్ కుమార్, ఏలూరు మరియు కృష్ణా జిల్లాల ఎస్పీలు ఉన్నత స్థాయి అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ సమావేశం నిర్వహించి ముమ్మర భద్రతను సమీక్షించారు.

## 20వేల మంది జెన్‌జీ యువతతో మాటామంతి



నెల్లూరు, ఆగస్టు 24: స్వామి వివేకానంద, శ్రీశ్రీ చెప్పినట్టు యువత పాత్రే దేశానికి కీలకమని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. నేడు యువత.. దేశ భవిష్యత్తు కోసం ఆలోచిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులన్న తేడా లేకుండా యువత రాజకీయ నాయకులను ప్రశ్నిస్తోందని.. ఇది మంచి నిర్ణయమని.. దీన్ని తాను కూడా స్వాగతిస్తున్నట్లు చెప్పారు. 20 వేల మంది జెన్‌జీ యువతతో 55 రోజుల పాటు 51 చోట్ల మాటామంతి నిర్వహిస్తున్నామని తెలిపారు. (మంగళవారం) ఉదయం నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ, ఏపీ ముఖ్యమంత్రి.. దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలపై చర్చ నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మంత్రి నారా లోకేశ్ ఎన్నో వ్యయప్రయాసలతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం చేస్తున్న కృషిపై చర్చ ఉంటుందన్నారు. యువత ఉద్యోగాలకు సంబంధించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. సీఎం చంద్రబాబు ముందు చూపుతో తీసుకొచ్చిన కంప్యూటర్ వలనే ఉద్యోగాలు వస్తున్నాయని

## సాధిక్ ఖాన్ కరుడుగట్టిన నేరస్థుడు



రాజమహేంద్రవరం, ఆగస్టు 24 : కాకినాడ జిల్లా పిఠాపురం పంచాయతీరాజ్ ఏఈ టిల్లపూడి నూకరాజు కేసులో నిందితుడు సాధిక్ ఖాన్‌పై మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. సాధిక్ ఖాన్ కరుడుగట్టిన నేరస్థుడని అన్నారు. నూకరాజు మనవడు కార్తికేయ రెడ్డి విద్యకు అవసరమైన ఖర్చును తానే భరిస్తానని భరోసా కల్పించారు. రావులపాలెంలో ఈరోజు (సోమవారం) భాస్కర్ రెడ్డిని, మనవడు కార్తికేయ రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో విజయసాయి మాట్లాడారు.
సాధిక్ వల్ల హిందూమతంలో ఉన్న రెడ్డి కుటుంబం, బీసీ కుటుంబాలు అన్యాయానికి గురి అయ్యాయని విజయసాయి రెడ్డి చెప్పుకొచ్చారు. నూకరాజు కుటుంబంలో ముగ్గురు మరణించడం తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని అన్నారు. సాధిక్.. ఏఈ నూకరాజు ఆస్తులను బ్యాంకు లాకర్లను, స్థలాలను రాయించుకున్నాడని ఆరోపించారు. ఫోన్లను బలవంతంగా లాక్కున్నాడని అన్నారు. రూ.2 కోట్ల బంగారం, రూ.2 కోట్ల నగదు, రావులపాలెంలో ఉన్న రూ.10 కోట్ల భూమిని, కాకినాడలో ఉన్న మరో భూమిని, జగదీశ్వర్ రెడ్డి ఇన్సూరెన్స్ సొమ్మును నిందితుడు సాధిక్ ఖాన్ లాక్కున్నాడని ఆరోపించారు. నిందితుడు సాధిక్ అనేకసార్లు కార్తికేయ రెడ్డిని హింసించాడని తెలిపారు. సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డిని సాధిక్ కొట్టాడన్నారు. కెనడా నుంచి ముంబైకి స్లో పాయిజన్ తీసుకువచ్చి హైదరాబాద్‌లో జగదీశ్వర్ రెడ్డికి ఇచ్చాడని ఆరోపించారు.

# మొదటి సారి మేకప్ వేసుకుంటున్నారా?



మేకప్ వేసుకోవడం ఓ కళ. అయితే మొదటిసారి ప్రయత్నించేటప్పుడు మార్కెట్లో ఉండే రకరకాల ఉత్పత్తులు, పద్ధతులు చూసి కాస్త గందరగోళంగా అనిపించడం సహజమే. కానీ, కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే తక్కువ సమయంలోనే సహజంగా మెరిసిపోవచ్చు. సరైన బేస్ లేకపోతే మేకప్ ఎక్కువ సమయం నిలవదు. కాబట్టి ముందుగా ముఖాన్ని సిద్ధం చేయడం ముఖ్యం. అందులో భాగంగా ముఖాన్ని ఫేస్వాష్తో శుభ్రంగా కడగాలి. చర్మానికి తేమను అందించడానికి నాణ్యమైన మాయిశ్చరైజర్ రాయాలి. పగటిపూట బయటకు వెళ్లేటప్పుడు సన్స్క్రీన్ తప్పనిసరి. అలానే, చర్మంపై ఉన్న రంధ్రాలు కనిపించకుండా మేకప్ను సమానంగా పరిచేందుకు ప్రైమర్ సహాయపడుతుంది.

ఇలా వేసుకోవాలి...

మొదటిసారి మేకప్ వేసుకునే వాళ్లు హెవీ ఫౌండేషన్ కంటే బీబీ క్రీమ్ లేదా స్కిన్ టింట్ వాడటం మంచిది. మీ స్కిన్ టోనికి సరిపోయే షేడ్ ఎంచుకుని, వేళ్లతో లేదా బ్యూటీ బ్లెండర్తో సమానంగా అద్దండి. ఆ తర్వాత కంటి కింద నల్లటి వలయాలు, మొటిమల మచ్చలు ఉంటే అక్కడ మాత్రమే కొద్దిగా కన్సీలర్ రాసి బ్లెండ్ చేయండి. మేకప్ జిడ్డుగా మారకుండా, ఎక్కువ సేపు తాజాగా ఉండటానికి టి–జోన్ (నుదురు, ముక్కు, గడ్డం) వద్ద కాంపాక్ట్ లేదా లూజ్ పౌడర్ ని లైట్గా అద్దండి. ఆపై చెంపలపై సహజమైన గులాబీ రంగు కోసం బ్లష్ అప్లై చేయండి. మీ డ్రెస్సింగ్కి తగిన లిపిస్టిక్ లేదా లిప్ గ్లాస్ ఎంచుకోండి. కనుబొమలను ఐబ్రో పెన్సిల్ తేలికగా షేప్ చేయాలి. ఐలైనర్, మస్కారాలు మీ కళ్లను మరింత ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తాయి.

జాగ్రత్తలివి... ఫౌండేషన్ లేదా కన్సీలర్ కొనేటప్పుడు మీ మెడ లేదా దవడ ఎముక వద్ద మ్యాచ్ చేసి చూసుకోండి.

మేకప్ ప్రొడక్ట్ను సరిగ్గా బ్లెండ్ చేయకపోతే ముఖంపై గీతల్లా కనిపిస్తాయి. రాత్రి పడుకునే ముందు. కెమింగ్ ఆయిల్ లేదా మైసెలర్ వాటర్తో మేకప్ను పూర్తిగా తొలగించడం స్కిన్

# వర్షాకాలంలో మీ ఫేవరెట్ షూస్ పాడవకుండా పాటించాల్సిన చిట్కాలు

ఫ్యాషన్ ప్రియులకు స్నీకర్లు కేవలం కాళ్లకు వేసుకునే బూట్లు మాత్రమే కాదు.. వారి వ్యక్తిత్వానికి ఒక స్టైల్ స్టేట్మెంట్. అయితే వర్షాకాలంలో అడుగడుగునా ఎదురయ్యే బురద గుంటలు, చినుకుల తడి మన ఫేవరెట్ స్నీకర్ల లుక్ను క్షణాల్లో పాడు చేస్తాయి. ఎంత కాపాడుకుందామన్నా తడిబడితే బూజు పట్టడం, దుర్వాసన రావడం, గమ్ ఊడిపోవడం వంటి సమస్యలు రావడం సహజం. అలాగని వర్షం పడుతోందని మీకు ఇష్టమైన ట్రెండీ స్నీకర్లను షూ రాక్కే పరిమితం చేయాల్సిన అవసరం లేదు. చిన్న చిన్న జాగ్రత్తలు, తెలివైన కేరింగ్ టిప్స్ పాటిస్తే వానాకాలంలో కూడా మీ బూట్లను డ్యామేజ్ కాకుండా కాపాడుకోవచ్చు.రోడ్లపై నిలిచే వర్షపు నీరు, బురద వల్ల స్నీకర్లు పాడైపోతాయి అనే ఆందోళన ప్రతిఒక్కరిలో ఉంటుంది. అలాగే వర్షాకాలంలో సరిగా పట్టించుకోకపోతే అవి రంగు మారి, దుర్వాసన వచ్చి త్వరగా పాడైపోతాయి.

అందుకే వర్షాకాలంలో స్నీకర్లను తడి నుంచి, బురద నుంచి కాపాడుకోవడం చాలా అవసరం. సరైన సంరక్షణ పద్ధతులు పాటిస్తే వర్షంలో కూడా స్నీకర్లు కొత్తవాటిలా మెరిసిపోతాయని రీసెర్చ్గేట్ అధ్యయనం పేర్కొంది. ఈ నేపథ్యంలో స్నీకర్ల మన్నిక పెంచే కొన్ని అద్భుతమైన చిట్కాలను తెలుసుకుందాం..

ప్రొటెక్టివ్ స్ప్రేలను వాడాలివర్షాకాలం ప్రారంభం కావడానికి ముందే మీ స్నీకర్లపై మంచి క్వాలిటీ ఉన్న వాటర్ప్రూఫ్ స్ప్రేని ఉపయోగించాలి. ఈ స్ప్రే బూట్లపై ఒక రక్షణ పొరలా ఏర్పడి నీరు, బురద లోపలికి ఇంకకుండా అడ్డుకుంటుంది. కాన్వాస్, స్యూడ్, లెదర్ షూస్కు సరిపోయే స్ప్రేలను చూసి ఎంచుకోవడం చాలా ముఖ్యం. బూట్లను శుభ్రం చేసిన ప్రతిసారీ ఈ ప్రొటెక్టివ్ స్ప్రేని మళ్లీ కోటింగ్లా వేయడం మంచిది.

# జుట్టు పొడిబారుతోందా? ఈ నేచురల్‌టిప్స్‌పాటిస్తే బెటర్!



పర్యావరణ కాలుష్యం, ఒత్తిడి, రసాయన ఉత్పత్తుల వాడకం వల్ల చాలా మందిని వేధించే ప్రధాన సమస్యల్లో జుట్టు పొడిబారడం ఒకటి. నిర్జీవంగా మారిన జుట్టుకు కేవలం పైపైన మెరుగులు దిద్దడం సరిపోదంటున్నారు నిపుణులు. దానికి లోతైన పోషణ, మృదువైన సంరక్షణ, కోల్పోయిన తేమను తిరిగి అందించే సహజ హైడ్రేషన్ అవసరమని చెబుతున్నారు. భారీ రసాయనాలతో కూడిన ఖరీదైన ప్రొడక్ట్స్‌పై ఆధారపడకుండా, ఇంట్లోనే లభించే సహజ పదార్థాలతో జుట్టు కుదుళ్లను బలోపేతం చేసుకోవచ్చని సూచిస్తున్నారు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

అవిసె గింజల జెల్ : అవిసె గింజల జెల్‌లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు, వృక్ష సంబంధిత సమ్మేళనాలు సమృద్ధిగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి జుట్టుకు తేమను అందించి, దాని స్థితిస్థాపకతను మెరుగుపరుస్తాయని అంటున్నారు. ఈ జెల్‌ను కురులకు అప్లై చేయడం వల్ల గరుకుగా ఉన్న జుట్టు సాఫ్ట్‌అవుతుందని తెలియజేస్తున్నారు. అంతేకాదు, జుట్టు చిక్కుపడటం కూడా తగ్గుతుందట.కలబంద గుజ్జు : కలబంద జుట్టుకు కావాల్సిన సహజమైన తేమను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే ప్రత్యేక ఎంజైమ్‌లు స్కాల్ప్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని అంటున్నారు. దీని జెల్ చాలా తేలికగా ఉండటం వల్ల జుట్టు జిడ్డుగా లేదా బరువుగా అనిపించకుండా పొడి జుట్టుకు లోతైన హైడ్రేషన్‌ను ఇస్తుందని తెలియజేస్తున్నారు. ఫలితంగా, జుట్టు చిక్కులు పడకుండా, మృదువుగా, మెరుస్తూ, సులభంగా దువ్వుకోవడానికి వీలుగా మారుతుందని వివరిస్తున్నారు. కలబందలో ఉండే తేమ గుణాలు, పోషక విటమిన్ల కారణంగా, పొడి జుట్టు, పొడి చర్మ సంరక్షణలో ఇది బాగా ప్రాచుర్యం పొందిందని పేర్కొంది.

# గోళ్లకు మసాజ్ కావాలి..



కొంతమందికి గోళ్లు పెంచుకోవడం ఇష్టం. పొడవాటి గోళ్లపై నచ్చిన నెయిల్ పాలిష్ వేసుకుని మురిసిపోతుంటారు. అయితే గోళ్ల విషయంలో ఎంత జాగ్రత్తగా ఉన్నా ఒక్కోసారి గోళ్లలో ఇన్ఫెక్షన్లు, విరిగిపోవడం, పొడిబారడం.. లాంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ఇలా జరగకుండా గోళ్ల సంరక్షణ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు.గిన్నెలు తోమడం, బట్టలు ఉతకడం, ఇల్లు తుడవడం.. వంటి పనులు చేసేటప్పుడు గోళ్లు ఎక్కువగా నీటిలో నానుతుంటాయి. ఫలితంగా త్వరగా నిర్జీవమై విరిగిపోయే ఆస్కారం ఉంటుంది. కాబట్టి ఇలాంటి పనులు చేసేటప్పుడు చేతులకు గ్లౌజులు ధరించడం మంచిది.గోళ్లను రోజుకోసారి మాయిశ్చరైజింగ్ లోషన్తో మసాజ్ చేయడం మర్చిపోవద్దు. ఫలితంగా రక్తప్రసరణ మెరుగై అవి ఆరోగ్యంగా, దృఢంగా పెరుగుతాయట. అంతేకాదు.. చేతులు కడుక్కున్న ప్రతిసారీ లోషన్ రాసుకోవడం మంచిది. తద్వారా గోళ్లకు తగినంత తేమ అందుతుంది.నెయిల్ పాలిష్ వేసుకున్నప్పుడల్లా దాన్ని తొలగించడానికి పాలిష్ రిమూవర్ని ఉపయోగిస్తుంటారు కొందరు. దీనివల్ల గోళ్ల ఆరోగ్యం దెబ్బతింటుందంటున్నారు నిపుణులు. రిమూవర్లో ఉండే ఎసిటోన్ గోళ్లను పొడిబారేలా చేయడమే ఇందుకు కారణమని చెబుతున్నారు.గోళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ సరిపడినన్ని నీళ్లు తాగడం అవసరం. తద్వారా గోళ్లకు తేమ అంది.. వాటి అందం, ఆరోగ్యం ఇనుమడిస్తాయి అని సూచిస్తున్నారు.

# నలుపు కిస్మిస్,పసుపు కిస్మిస్.. ఆరోగ్యానికి ఏది ఎక్కువ పవర్‌ఫుల్?



ద్రాక్షను డ్రై ఫ్రూట్స్ అనగానే మనందరికీ ముందుగా గుర్తొచ్చేది ఎండుద్రాక్ష (కిస్‌మిస్). రాత్రిపూట వీటిని నీటిలో నానబెట్టి, ఉదయం పరగడుపున తింటే శరీరానికి ఎన్నో పోషకాలు అందుతాయి. అయితే, షాపుల్లో దొరికే పసుపు (గోల్డెన్) కిస్‌మిస్‌లు మంచివా? లేక నల్ల కిస్‌మిస్‌లు ఆరోగ్యానికి బెటరా? అనే గందరగోళం చాలామందిలో ఉంటుంది. మరి ఈ రెండింటిలో ఏది ఎక్కువ పవర్‌ఫుల్లో, దేనివల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు సింపుల్‌గా తెలుసుకుందాం..నానబెట్టిన కిస్‌మిస్ ప్రత్యేకత: కిస్‌మిస్‌లను పచ్చిగా తినడం కంటే రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయాన్నే తినడం వల్ల రెట్టింపు లాభాలు ఉంటాయి. నానబెట్టడం వల్ల వాటి పైపొరలోని ఐరన్, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, ఫైబర్ మరియు యాంటీఆక్సిడెంట్లు నీటిలో కరిగి శరీరం త్వరగా గ్రహించేలా మారతాయి. ఇక ఇది మలబద్ధకం తగ్గేందుకు, బిపి నియంత్రణలో ఉండటానికి బాగా సహాయపడుతుంది.నల్ల కిస్‌మిస్ ప్రయోజనాలు: నల్ల ద్రాక్షను సహజంగా ఎండబెట్టడం ద్వారా ఇవి తయారవుతాయి. వీటి తయారీలో ఎలాంటి రసాయనాలు వాడరు. అందుకే వీటిలో యాంటీఆక్సిడెంట్లు, ఐరన్ మరియు ఫైబర్ చాలా ఎక్కువగా ఉంటాయి. ఇక రక్తహీనత (ఎనీమియా)తో బాధపడేవారికి, జుట్టు విపరీతంగా రాలే సమస్య ఉన్నవారికి మరియు రోగనిరోధక శక్తి పెంచుకోవాలనుకునే వారికి నల్ల కిస్‌మిస్ ఒక పవర్‌ఫుల్ మెడిసిన్‌లా పనిచేస్తుంది.

పసుపు కిస్‌మిస్ ప్రత్యేకం: పసుపు రంగు కిస్‌మిస్‌లు చూడటానికి ఆకర్షణీయంగా, తినడానికి మెత్తగా మరియు తియ్యగా ఉంటాయి. రంగు మారకుండా ఉండటానికి వీటిని సల్ఫర్ డయాక్సైడ్‌తో ట్రీట్ చేస్తారు. ఇక ఇవి జీర్ణక్రియను వేగవంతం చేయడానికి, రక్తంలో షుగర్ లెవల్స్‌ను సమతుల్యం చేయడానికి మరియు థైరాయిడ్ సమస్యలను అదుపులో ఉంచడానికి ఎంతగానో తోడ్పడతాయి.

మెట్రో




# ఉదయం ఆరోగ్యానికి మేలు చేసే బెస్ట్ ఫుడ్స్ ఇవే!



ఉదయాన్నే లేవగానే మన పొట్ట ఖాళీగా ఉంటుంది. ఆ సమయంలో కడుపులో ఏం వేస్తున్నామనేదే రోజంతా మన ఆరోగ్యాన్ని, శక్తిని డిసైడ్ చేస్తుంది. ఏది పడితే అది తింటే కడుపులో తిప్పడం, గ్యాస్ రావడం లాంటి సమస్యలు తప్పవు. అందుకే పరగడుపున సరైన ఆహారం తీసుకుంటే రోజంతా ఎనర్జిటిక్‌గా ఉండటమే కాకుండా, ఎన్నో ఆరోగ్య లాభాలు సొంతమవుతాయి. ఖాళీ కడుపుతో తింటే ఒంటికి మేలు చేసే ఆ బెస్ట్ ఫుడ్స్ ఏంటో ఇప్పుడు వివరంగా చూద్దాం..

బొప్పాయి పండు: రోజును బొప్పాయితో ప్రారంభిస్తే జీర్ణ వ్యవస్థ చాలా బాగుంటుంది. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ప్రేగుల కదలికలు ఉండి, మలబద్ధకం తగ్గుతుంది. అంతేకాదు, ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. బొప్పాయి తిన్న తర్వాత ఒక గంట వరకు ఏదీ తినకూడదు, అప్పుడే అది ఒంటికి పూర్తిగా పడుతుంది.తాజా పుచ్చకాయ: ఉదయాన్నే పుచ్చకాయ తింటే శరీరం రోజంతా తాజాగా ఉంటుంది. ఇందులో 90 శాతం నీళ్లే ఉంటాయి కాబట్టి డీహైడ్రేషన్ రాకుండా కాపాడుతుంది. కేలరీలు తక్కువగా ఉండి విటమిన్లు, లైకోపీన్ ఎక్కువగా లభిస్తాయి. బరువు పెరగకుండా రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి ఇది బెస్ట్ ఆప్షన్.నానబెట్టిన డ్రై ఫ్రూట్స్: రాత్రి నానబెట్టిన బాదం, వాల్‌నట్స్, అంజీర్లను పరగడుపున తింటే శరీరానికి కావలసిన మంచి ప్రొటీన్, హెల్దీ ఫ్యాట్స్ అందుతాయి. ఇవి రోజంతా కావాల్సిన శక్తిని ఇస్తాయి.అలాగే ఖర్జురాలు,కిస్మిస్ వంటివి తింటే మంచిది అని నిపుణులు తెలుపుతున్నారు.ఆరోగ్యకరమైన పానీయాలు: జీలకర్ర నీళ్లు, వాము నీళ్లు, లేత కొబ్బరినీళ్లు లేదా గోరువెచ్చని నీళ్లతో రోజును మొదలుపెట్టడం చాలా మంచిది. ఇక ఇవి జీర్ణక్రియను వేగవంతం చేసి, బాడీలోని టాక్సిన్లను బయటకు పంపుతాయి. బరువు తగ్గాలనుకునే వారికి, హార్మోన్ల సమస్యలు ఉన్నవారికి ఇవి బాగా పనిచేస్తాయి. కూరగాయల జ్యూసులు: క్యారెట్, బీట్‌రూట్ లేదా ఆకుకూరల జ్యూస్ తాగడం వల్ల విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా అందుతాయి. ముఖ్యంగా మహిళల్లో చర్మ కాంతిని పెంచడానికి, జుట్టు ఊడటం తగ్గించడానికి ఈ జ్యూసులు చాలా మేలు చేస్తాయి.

ఇక ఉదయాన్నే మనం తీసుకునే ఆహారమే మన రోజంతా ఉండే ఉత్సాహానికి పునాది. కాబట్టి ఖాళీ పొట్టతో అనారోగ్యకరమైనవి తినకుండా, పైన చెప్పుకున్న సహజమైన ఆహారాలను అలవాటు చేసుకుంటే ఆరోగ్యం మీ సొంతమవుతుంది.

# నేచురల్‌గా సైనస్ తగ్గాలా?.. ఈ సింపుల్ డ్రింక్



ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అనుసరించడంఅనాటమీ స్టడీ మోడల్స్‌ను ఎంచుకోవడంనేటికాలంలో జీవనశైలి మార్పులు, బయటి ఆహార అలవాట్లు మరియు వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల చాలామంది సైనస్, జలుబు, తీవ్రమైన తలనొప్పి వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో సైనస్ సమస్య ఎక్కువై ముక్కు మూసుకుపోవడం, చిన్న పనికే తీవ్రంగా అలసిపోవడం జరుగుతుంటుంది. ఎన్ని మందులు వాడినా తగ్గని ఈ సమస్య నుంచి సహజంగా ఉపశమనం పొందడానికి ఒక సులభమైన ఇంటి చిట్కా బాగా ఉపయోగపడుతుంది. దాని తయారీ విధానం ఇప్పుడు తెలుసుకుందాం..

వైవిధ్యమైనఆహార పదార్థాలను అన్వేషించడం

సహజసిద్ధమైన డ్రింక్ తయారీ విధానం: ఈ డ్రింక్ తయారు చేయడానికి ముందుగా ఒక చిన్న పాత్రలో ఒక గ్లాసు పాలు పోసి బాగా వేడి చేయాలి. పాలు కాగిన తర్వాత అందులో తగినంత బెల్లం తురుము వేయాలి. దీనికి తోడుగా రోటిలో దంచిన తాజా మిరియాల పొడిని మరియు చిన్న పటికబెల్లం ముక్కను కూడా కలపాలి. ఈ పదార్థాలన్నీ మనకు ఇంట్లో లేదా బయట చాలా సులభంగా లభిస్తాయి.

ఎలా వాడాలి? పొందే ప్రయోజనాలు ఏంటి?: ఈ పాలను వరుసగా మూడు రోజుల పాటు రాత్రి పడుకునే ముందు వేడిగా తాగాలి. మిరియాల్లో ఉండే ఘటుదనం మరియు బెల్లం, పటికబెల్లం కలయిక వల్ల కఫం కరిగిపోయి మూసుకుపోయిన ముక్కు తెరుచుకుంటుంది. ఇక ఫలితంగా సైనస్, జలుబు వల్ల వచ్చే తలనొప్పి నుంచి మంచి ఉపశమనం లభించి రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

సైనస్ మరియు జలుబు సమస్యలకు ఇంట్లో లభించే సహజ పదార్థాలతో చేసుకునే ఈ డ్రింక్ చాలా మంచి ఉపశమనాన్ని ఇస్తుంది. మందులపై మాత్రమే ఆధారపడకుండా ఇలాంటి ఇంట్లోనే దొరికే చిట్కాలను ప్రయత్నించడం ద్వారా తక్షణ హాయిని పొందవచ్చు.

# 'స్పిరిట్' వివాదం



ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్' సినిమా నుంచి స్టార్ హీరోయిన్ దీపిక పదుకొనే తప్పుకోవడంపై ఇండస్ట్రీలో చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈ వివాదంపై చిత్ర నిర్మాతల్లో ఒకరైన ప్రణయ్ రెడ్డి వంగా చేసిన వ్యాఖ్యలు మరింత దుమారం రేపాయి. సినిమా లాభాల్లో 10 శాతం వాటా : దీపిక పదుకొనే సినిమా నుంచి తప్పుకోవడానికి కేవలం పనివేళలే కాకుండా, ఆమె రెమ్యూనరేషన్ రూపంలో సినిమా లాభాల్లో 10 శాతం వాటా అడగడమే అసలు కారణమని ప్రణయ్ రెడ్డి వెల్లడించారు. బడ్జెట్ లెక్కలు కుదరకపోవడం వల్లే ఆమెను ప్రాజెక్ట్ నుంచి తప్పించాల్సి వచ్చిందని ఆయన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో ఓ ప్రముఖ జర్నలిస్ట్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ నెట్టింట వైరల్ అయింది. "హీరోలు ఎన్నో ఏళ్లుగా సినిమాల్లో లాభాల వాటాలు, ప్రత్యేక పద్ధతులు ఫాలో అవుతున్నారు కదా..? మరి ఓ ఫిమేల్ యాక్టర్ ప్రాఫిట్స్‌లో షేర్ అడిగితే తప్పేంటి?" అంటూ ఆ జర్నలిస్ట్ ప్రశ్నించారు. అంతేకాకుండా, మగ నటులు ఇవే డిమాండ్లు చేస్తే 'డిసిప్లిన్' అంటారు, అదే మహిళలు చేస్తే 'డిఫికల్ట్' అంటారా అంటూ అందులో మగ అహంకారాన్ని, రెండంచల విధానాన్ని ప్రశ్నించారు. ఆశ్చర్యకరంగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ పోస్ట్‌కు దీపిక పదుకొనే లైక్ కొట్టారు.

# 'విశ్వనాథ్ సన్స్'



దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన కుటుంబ కథా చిత్రం 'విశ్వనాథ్ సన్స్' థియేటర్లలో రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతోంది. ఈ నెల 14న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం, కేవలం 10 రోజుల్లోనే రూ. 200 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మార్కును దాటినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. వినోదంతో పాటు బలమైన కుటుంబ భావోద్వేగాలను జోడించి వెంకీ అట్లూరి తీర్చిదిద్దిన విధానం అన్ని వర్గాల ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వీకెండ్స్‌లోనే కాకుండా వారపు రోజుల్లో కూడా హౌస్‌ఫుల్ బోర్డులతో ఈ చిత్రం థియేటర్ల వద్ద సందడి చేస్తోంది.

# రూ.50కోట్లకు చేరువలో 'ఇరుముడి'




మాస్ మహారాజా రవితేజ నటించిన లేటెస్ట్ చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద శుభారంభాన్ని అందుకుని భారీ కలెక్షన్ల దిశగా దూసుకుపోతోంది. విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా రూ. 47.45 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి సరికొత్త రికార్డుల వైపు అడుగులు వేస్తోందని సినీ వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ చిత్రానికి మంచి ఆదరణ లభిస్తోంది, అక్కడ ఇప్పటికే రూ. 11 కోట్ల గ్రాస్‌ను కొల్లగొట్టింది. రవితేజ మాస్ యాక్షన్, కథనంలో ఉన్న ఎమోషన్ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తుండటంతో వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉంది.

# 50 భాషల్లో 'వారణాసి' డబ్బింగ్?



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్ట్ 'వారణాసి' మూవీకి సంబంధించిన ఒక సంచలన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ విజువల్ వండర్‌ను ఏకంగా 50 భారతీయ మరియు అంతర్జాతీయ భాషల్లో డబ్బింగ్ చేసి విడుదల చేయడానికి మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 'ఆర్ఆర్ఆర్' సినిమాతో హాలీవుడ్ స్థాయి గుర్తింపు పొందిన రాజమౌళి, ఈసారి అంతకుమించిన గ్లోబల్ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ అపూర్వమైన ప్రయోగానికి శ్రీకారం చుట్టారని వార్తలు వస్తున్నాయి. సాధారణంగా ఎక్కువ భాషల్లో డబ్బింగ్ చేయడానికి ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను ఉపయోగిస్తున్నప్పటికీ, రాజమౌళి మాత్రం ఆ బాటలో వెళ్లకూడదని నిర్ణయించుకున్నట్లు సమాచారం. సీన్లలోని అసలైన భావోద్వేగాలు, ఎమోషన్లు ఏమాత్రం తగ్గకుండా ఉండేందుకు ఆయా దేశాలలోని, ఆయా భాషలకు చెందిన ఒరిజినల్ ఆర్టిస్టులతోనే డబ్బింగ్ చెప్పించాలని భావిస్తున్నారు. సాంకేతికత కంటే నటీనటుల గొంతులోని భావోద్వేగాలే ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతాయని నమ్మే జక్కన్న, ఈ గ్లోబల్ ప్రాజెక్ట్ కోసం ఏ విషయంలోనూ రాజీ




శ్రీలంకతో రెండో టెస్టులో టీమిండియా బ్యాటర్ దేవదత్ పడిక్కల్ మరోసారి అదరగొట్టాడు. తొలి టెస్టులో అద్భుత శతకంతో ఆకట్టుకున్న అతడు.. రెండో టెస్టులోనూ 117 పరుగులతో సెంచరీ నమోదు చేశాడు. గాయంతో సాయి సుదర్శన్ దూరం కావడంతో తుది జట్టులో చోటు దక్కించుకున్న పడిక్కల్.. వరుస సెంచరీలతో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్.. భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. సాయి సుదర్శన్‌ను మూడో స్థానంలో కొనసాగించాలని గంభీర్ గతంలో చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఇక పడిక్కల్‌ను భవిష్యత్తులో పక్కన పెట్టలేరని తెలిపాడు.

'తొలి టెస్టులోనే 200కు పైగా పరుగులు చేసిన పడిక్కల్‌ను భవిష్యత్తులో ఎలా పక్కన పెడతారు? గంభీర్ ఎప్పుడూ ఏదో ఒకటి చెబుతూ ఉంటాడు. శ్రీలంక, అఫ్గానిస్థాన్ లాంటి జట్లపై గెలిచిన తర్వాత మాత్రమే చాలా ఎక్కువగా మాట్లాడతాడు. శ్రీలంకతో సిరీస్‌లో కోచ్‌గా గంభీర్‌కు పెద్దగా పని లేదు. ఎందుకంటే లంక జట్టు అంత గొప్పగా ప్రదర్శన చేయడం లేదు. కాబట్టి సిరీస్‌ను టీమిండియానే గెలుచుకుంటుంది. అందులో ఎలాంటి అనుమానం లేదు. అయితే గంభీర్‌ను వ్యక్తిగతంగా విమర్శించడం నా ఉద్దేశం కాదు. అతడు మంచి ప్లేయర్. ఆటను బాగా అర్థం చేసుకోగలడు. కానీ గంభీర్ ఆటగాళ్లతో మరింత కమ్యూనికేట్ చేస్తే బాగుంటుంది' అని క్రిస్ శ్రీకాంత్ వెల్లడించాడు.




టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ మైదానంలో ప్రదర్శించే దూకుడుపై తాజాగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. శ్రీలంకతో జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో ప్రత్యర్థి ఆటగాడు అసిత ఫెర్నాండోతో జైస్వాల్ వ్యవహరించిన తీరుపై కొందరు మాజీ ఆటగాళ్లు విమర్శించారు. భారత బ్యాటింగ్ కోచ్ సీతాంశు కోటక్ సైతం జైస్వాల్ అంతగా ఫెర్నాండోకు దగ్గరగా వెళ్లి ఉండాల్సి కాదని అభిప్రాయపడ్డారు. ఈ వివాదంపై ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే స్పందిస్తూ.. జైస్వాల్ అద్భుతమైన ప్రతిభ ఉన్న ఆటగాడని, కాకపోతే ప్రత్యర్థుల మాటలకు రియాక్ట్ అవుతాడన్నారు. జైస్వాల్ ఇలాంటి చర్యలకు దిగకుండా తన ఆటపై దృష్టి పెట్టాలని ఓ వీడియోలో పేర్కొన్నారు. ప్రత్యర్థి ఆటగాడు రెచ్చగొట్టారు నిజమే, కానీ అతనూ(జైస్వాల్) కొంచెం హద్దు మీరి దగ్గరకు వెళ్లాడు అని హర్షా భోగ్లే అభిప్రాయపడ్డాడు. ఈ వ్యాఖ్యలపై యశస్వి జైస్వాల్(సోమవారం) ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిస్తూ మరోసారి ఘాటుగా బదులిచ్చాడు. హర్షా భోగ్లే పోస్ట్ చేసిన వీడియోపై స్పందిస్తూ.. 'సదరు ఆటగాడు ఏమన్నాడో మీకు తెలియకుంటే.. ఇలాంటి తీర్పులు ఇవ్వడం ఆపండి. ఎవరైనా హద్దులు మీరి ప్రవర్తిస్తే.. భారత్ తిరిగి పోరాడుతుందని.. వాళ్లకు గట్టిగానే బదులు ఇస్తుందని చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని జైస్వాల్ కామెంట్ సెక్షన్‌లో తన అభిప్రాయాన్ని పంచుకుంటూ.. హర్షా భోగ్లేకు కౌంటర్ ఇచ్చాడు.

## మెట్రో స్పోర్ట్స్ ఎట్టు

# రికార్డ్ సృష్టించిన రిషభ్ పంత్



భారత వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ టెస్ట్ క్రికెట్‌లో మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. విదేశీ మరియు న్యూట్రల్ వేదికల్లో భారత్ తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన వికెట్ కీపర్‌గా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. శ్రీలంకతో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో పంత్ ఈ మైలురాయిని అధిగమించారు. ఇప్పటివరకు విదేశీ గడ్డపై 2,501 పరుగులతో అగ్రస్థానంలో నిలిచిన పంత్, భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ (2,496 పరుగులు) పేరిట చాలా కాలంగా ఉన్న ఆల్-టైమ్ రికార్డును బద్దలు కొట్టారు. ఈ జాబితాలో ధోనీ రెండో స్థానానికి పరిమితమవ్వగా, ఆ తర్వాత ఫరూక్ ఇంజినీర్ (1,209 పరుగులు), సయ్యద్ కిర్మాణి (1,109 పరుగులు) మరియు కిరణ్ మోరే (901 పరుగులు) తదుపరి స్థానాల్లో ఉన్నారు. కేవలం రన్స్ రికార్డుతోనే కాకుండా, పంత్ తన మార్క్ ధనాధన్ బ్యాటింగ్‌తో సిక్సర్ల విషయంలోనూ సరికొత్త రికార్డు నమోదు చేశారు. టెస్టు క్రికెట్ చరిత్రలో 100 సిక్సర్లు పూర్తి చేసిన బ్యాటర్ల జాబితాలో (మొత్తం 101 సిక్సర్లు) చేరి, అత్యధిక సిక్సర్లు కొట్టిన ప్రపంచ క్రికెటర్లలో మూడో స్థానానికి ఎగబాకారు. విదేశీ పిచ్‌లపై ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ, టీమిండియాకు క్లిష్ట పరిస్థితుల్లోనూ విజయాలు అందించే పంత్ శైలి అతడిని ప్రపంచంలోనే అత్యుత్తమ వికెట్ కీపర్ బ్యాటర్లలో ఒకరిగా నిలబెట్టింది. ఈ తాజా రికార్డులతో సుదీర్ఘ ఫార్మాట్‌లో తనకున్న ఆధిపత్యాన్ని పంత్ మరోసారి నిరూపించుకున్నారు.




16 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలపై ద్రోణాచార్య అవార్డు గ్రహీత జిమ్నాస్టిక్స్ కోచ్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. 45 ఏళ్ల జిమ్నాస్టిక్ కోచ్ గణేశ్ ప్రభాకర్‌పై విలెపార్లే ప్రాంతానికి చెందిన బాలిక ఫిర్యాదు చేయడంతో ఈ కేసు నమోదైంది.

పోలీసుల సమాచారం ప్రకారం.. బాధితురాలైన బాలిక కొన్నేళ్లుగా జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ తీసుకుంటోంది. ఈ క్రమంలో ఇంటి వద్ద చదువుకుంటున్న బాలికకు కోచ్ వాట్సాప్‌లో 'హాయ్' అంటూ మెసేజ్ పంపాడు. దీంతో కోచ్‌ను సంప్రదించి విషయం తెలుసుకోవాలని బాలిక తల్లి సూచించింది. అనంతరం బాలికను జిమ్నాసియంకు రావాలని, కలిసేందుకు సమయం ఉందా అని కోచ్ అడిగినట్లు తెలుస్తోంది. దీంతో బాలిక అక్కడికి వెళ్లగా.. ఒంటరిగా ఉన్న కోచ్ గణేశ్ ఆమెను అసభ్యంగా తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అక్కడ నుంచి ఎలాగోలా బయటపడిన ఆ బాలిక కాలేజీకి వెళ్లిపోయింది. ముభావంగా ఉన్న ఆమెను పీఈటీ గమనించి ఆరా తీశారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది.

Published, Printed, Edited and Owned by **DEVARAKONDA KALIDAS** Printed at DK Publications, 2-3-691/1/A, CPL Main Road, Amberpet, Hyderabad and Published at D.No.1-9-628/4, J.P.Residency, Vidyangar, Hyderabad - 44, **Editor: D.Kalidas, RNI.NO.68319/98, Post Regd.No. HSE/953/2014-16** Phone: 8919130975, 99126 14007